మానేరు **జనత**®
తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక

8.3.2026 ఆదివారం Sunday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 318 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar

సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

శుభాకాంక్షలు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్

## తెలంగాణ గద్దర్ ఫిల్మ్ 2025 విజేతలు వీరే..!



## అంతర్జాతీయ సంతాలి సభ
# వేదిక మార్పు

### రాష్ట్రపతిని స్వాగతించని మమత, మంత్రులు
### బెంగాల్ వ్యవహారంపై బహిరంగంగానే ముర్ము అసహనం
### మమత తన చిన్న చెల్లెలంటూ కితాబు



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం నాడు నార్త్ బెంగాల్‌లో అంతర్జాతీయ సంతాలి సదస్సును ప్రారంభించారు. అయితే తన పర్యటనలో పలు ప్రోటోకాల్ ఉల్లంఘనలు చోటుచేసు కోవడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. భద్రతా కారణాల పేరుతో బిధాన్‌నగర్‌లో జరగాల్సిన సదస్సు వేదకను బాగ్‌డోగ్రా ఎయిర్‌పోర్ట్ సమీపంలోని గోసాయిపూర్‌కు మార్చడం, వేదక చిన్నది కావడంతో గిరిజన కమ్యూనిటీకి చెందిన వారు పెద్దసంఖ్యలో రాలేకపోవడం వంటివి చోటుచేసుకున్నాయి.



## రాష్ట్రపతినే అవమానిస్తారా ?

### ఇది సిగ్గుచేటైన వ్యవహారంగా పరిగణిస్తున్నాం
### ముర్ముకు బెంగాల్‌లో అవమానంపై మమతపై మోడీ ఆగ్రహం

04



## రైతుబంధు ఇంకా
# ఎప్పుడిస్తారు

### మూడు పంటలకని చెప్పి ఒకటి కూడా ఇవ్వరా
### కరీంనగర్ జిల్లాలో పర్యటించిన హరీష్ రావు

03

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు ఇచ్చే తెలివి లేదా అని ప్రశ్నించారు. మూడు పంటలకు రైతుబంధు ఇవ్వాలని గతంలో ఆయన చెప్పారని.. కానీ ఇప్పుడు తన హయాంలో మూడు పంటలకు రైతుబంధు ఎగొట్టారని ధ్వజమెత్తారు.

## వ్యవసాయ యాంత్రీకరణకు
# సబ్సిడీ నిధులు

### నేరుగా రైతుల ఖాతాలోకి బదిలీ

- విధివిధానాలు తయారుచేయాలి
- ఏప్రిల్ నెలాఖరు వరకు పచ్చిరొట్ట విత్తనాలను సిద్ధం చేయాలి
- రెడ్కో సహకారంతో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు
- ఖరీఫ్ సీజన్ కోసం ముందుగానే ఎరువులు
- అధికారులను అదేశించిన మంత్రి తుమ్మల



02




# మహిళల రక్షణ సమాజం బాధ్యత

### వారి కోసం ఎన్నో చట్టాలు తెచ్చాం
### ఆర్థిక స్వావలంబన కోసం అనేక పథకాలు అమలు
### మహిళా వేధింపులను నిలదీసే సమాజం రావాలి
### స్టాండ్ విత్ హర్ కార్యక్రమంలో సిఎం రేవంత్



**జనతా న్యూస్, హైదరాబాద్ :** మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. జేఎన్‌టీయూ ఆడిటోరియంలో 'స్టాండ్ విత్ హర్' కార్యక్రమంలో సీఎం రేవంత్ పాల్గొన్నారు. మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు తీసుకొస్తున్నాం. వారు ఆర్థికంగా బలపడాలనే ఆలోచనతోనే మహిళాశక్తి పథకం తీసుకొచ్చాం. మహిళలపై ప్రభుత్వానికి సంపూర్ణ విశ్వాసం ఉంది. వారి ప్రాధాన్యం గుర్తించి పార్టీలో పదవులు ఇస్తున్నాం. ఆర్టీసీలో వెయ్యి బస్సులకు మహిళలే యజమానులు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తోంది. సోషల్ మీడియాలో మహిళలను వేధించే ఘటనలు తాజాగా పెరుగుతున్నాయి. వాటిని కట్టడి చేయాల్సి ఉందని అన్నారు. ఈ సందర్భహంగా మహిళలకు ముఖ్యమంత్రి

మిగతా 2 లో



## శాంతియుత వాతావరణమమే
# శ్రీరామరక్ష

### లొంగిన మావోయిస్టులకు ఆర్థిక, ఆరోగ్య భద్రత
### 130 మంది మావోయిస్టులు లొంగుబాటు
### గణపతి కూడా లొంగి పోవాలన్న ముఖ్యమంత్రి రేవంత్



# మా దాడులు ఉద్దేశ్యపూర్వకం కాదు

### గల్ఫ్ దేశాలకు ఇరాన్ అధ్యక్షుడి క్షమాపణలు

4

గల్ఫ్ దేశాలకు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజిష్కియాన్ క్షమాపణలు చెప్పారు. ఇరుగుపొరుగు దేశాలపై క్షిపణలు, డ్రోన్ దాడులు చేసే ఉద్దేశం తమకు లేదని చెప్పారు. అయితే ఆయా దేశాలు తమ భూభాగాల నుంచి ఇరాన్‌పై దాడిని ప్రారంభించకుంటే తాము కూడా దాడి చేయమని అన్నారు.

## 99 రోజుల్లో నిర్దేశించిన లక్ష్యాలను
# చేరుకోవాలి

### హౌసింగ్ బోర్డులోని 5వేల రిజిస్ట్రేషన్ల పక్రియ పూర్తిచేయాలి
### పోర్టల్‌ను ప్రారంభించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




03

ప్రజాపాలన- ప్రగతి నివేదిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా హౌసింగ్ బోర్డు పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఐదు వేల రిజిస్ట్రేషన్‌లను క్లియర్ చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ప్రజలకు పారదర్శకంగా వేగవంతమైన సేవలు అందించడానికి తెలంగాణ హౌసింగ్ బోర్డు రూపొందించిన రిజిస్ట్రేషన్ పోర్టల్‌ను మంత్రి శనివారంనాడు సచివాలయంలో ప్రారంభించారు.



# వ్యవసాయ యాంత్రీకరణకు సబ్సిడీ నిధులు

**నేరుగా రైతుల ఖాతాలోకి బదిలీ.. విధివిధానాలు తయారుచేయాలి**

**ఏప్రిల్ నెలాఖరు వరకు పచ్చిరొట్ట విత్తనాలను సిద్ధం చేయాలి**

**రెడ్కో సహకారంతో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు**

**ఖరీఫ్ సీజన్ కోసం ముందుగానే ఎరువులు**

**అధికారులను ఆదేశించిన మంత్రి తుమ్మల**

**హైదరాబాద్,మార్చి7 :** వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి వ్యవసాయ యాంత్రీకరణకు సంబంధించిన సబ్సిడీ నిధులను నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేసే విధానాన్ని అమలు చేసే అవకాశాలను పరిశీలించి, అవసరమైన విధివిధానాలను రూపొందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రానున్న ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రస్తుతం వ్యవసాయ యాంత్రికరణలో భాగంగా రైతులు కొనుగోళ్లు చేసిన పనిముట్లకు 40 శాతం సబ్సిడీ నిధులను సదరు కంపెనీలకు అందించే పద్దతి ఉంది అలా కాక, వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి సబ్సిడీ నిధులను నేరుగా రైతుల ఖాతాలోకి బదిలీ చేసే అవకాశాలను పరిశీలించి అందుకు తగ్గ విధివిదానాలను తయారు చేయాలన్నారు. రాష్ట్రంలో రైతులకు సబ్సిడీపై అందించే పచ్చిరొట్ట విత్తనాలను వచ్చే ఏప్రిల్ నెలాఖరు సిద్దంగా ఉంచుకోవాలని అందుకు తగ్గ ఏర్పాట్లు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతు వేదికలలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించాలని, ఇందుకు రెడ్కో సంస్థ సహకారం తీసుకోవాలని అధికారులకు సూచించారు. మొదట ప్రయోగాత్మకంగా జంగారెడ్డిపల్లి మరియు జనంపేట రైతు వేదికలలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి వాటి పనితీరును పరిశీలించిన తరువాత మొదటి దశలో రాష్ట్రంలోని 1600 రైతు వేదికలలో రెడ్కో ద్వారా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఈనున్న ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రానికి అవసరమైన ఎరువులను ముందుగానే తెప్పించి నిల్వ ఉంచేందుకు ఇప్పటి నుంచే చర్యలు ప్రారంభించాలని మంత్రి అధికారులకు సూచించారు. ఎరువుల సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన కూడ ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్రానికి అవసరమైన ఎరువులను ముందుగానే సమకూర్చుకోవాలని తెలిపారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వ అధికారులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో వరి, పత్తి, మక్క వంటి ప్రధాన పంటల సాగు విస్తృతంగా జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా మక్క పంటకు వరి లేదా పత్తి పంటలతో పోలిస్తే యూరియా అవసరం దాదాపు మూడింతలు ఎక్కువగా ఉంటుందని చెప్పారు. నీటి నిల్వలు సమృద్ధిగా ఉండటం, నేలలో తేమ నిల్వ ఉండటం, అలాగే దక్షిణ పశ్చిమ రుతుపవనాలు సాధారణంగా ప్రారంభమవుతాయనే అంచనాల నేపథ్యంలో రానున్న ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం సుమారు 60.60 లక్షల హెక్టార్లలో సాగు అయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఖరీఫ్?2026 సీజన్‌కు రాష్ట్రానికి 11.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు మంత్రి తెలిపారు.

# హింసను కోరిన ప్రేమపెళ్లి

**వరుడి బంధువులపై పెళ్లికూతరు బంధువుల దాడి**

**ఆస్పత్రిలో చేరిన దాడిలో గాయపడ్డ వారు**

ఖమ్మం,మార్చి7(ఆర్ఎన్ఎ): వారిద్దరూ ప్రేమించుకున్నారు. ఊరినుంచి పరారై.. పెళ్లి చేసుకున్నారు. ఆ పెళ్లి ఫొటోలను వాట్సాప్ స్టేటస్‌లో పెట్టుకున్నారు. అంతే..ఆ ఫొటోలు, వారి ప్రేమ, పెళ్లి యువకుడి బాబాయిపై ఏకంగా కత్తులు, కర్రలతో దాడిచేసే స్థాయికి తీసుకెళ్లింది. ఆ ప్రేమజంట వివాహానికి పెళ్లికొడుకుకు వరుసకు బాబాయి, పిన్నియ్యే వడిత్య హేమ్లా, బుజ్జి కారణమన్న అనుమానంతో పెళ్లికూతురు తరపువారు హేమ్లా ఇంటికి వచ్చి కత్తులు, కర్రలతో దాడిచేయడంతో కత్తిపోట్లకు గురయ్యాడు. అతడిని గ్రామస్థులు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. కూసుమంచి మండలం లోక్యాతండాలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలివీ.. లోక్యాతండాలో ఆ గ్రామ ఆచారం ప్రకారం మూడురోజుల పాటు హోళీవేడుకలు జరిగాయి. అందరూ సంబరాల్లో ఉన్నారు. ఈ క్రమంలో తండాకు చెందిన ఓ యువతి, అదేతండాకు చెందిన ఉపేందర్ ప్రేమించుకున్నారు. పెళ్లికి ఇద్దరి కుటుంబసభ్యులు నిరాకరించడంతో ఎలాగైనా పారిపోయి పెళ్లిచేసుకోవాలని నిర్ణయించుకున్నారు. గురువారం అందరూ హోళీ వేడుకల్లో ఉన్న సమయంలో గ్రామం నుంచి వెళ్లిపోయి పెళ్లిచేసుకున్నారు. ఆ ఫొటోలను వాట్సాప్ స్టేటస్‌ల్లో పెట్టుకున్నారు. వాటిని చూసిన గ్రామస్థులు అవాక్కయ్యారు. ఇక తమకూతురు పెళ్లికి.. వరుడికి బాబాయి వరుసైన వడిత్య హేమ్లా, అతడి భార్య బుజ్జి కారణమని అనుమానించి.. యువతి తరుపు బంధువులు హేమ్లా ఇంటిపై దాడికివెళ్లారు. క్రమంలో హేమ్లా కత్తిపోట్లకు గురవడంతో ఖమ్మం తరలించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగా ఉంది. వడిత్య బుజ్జి ఫిర్యాదుమేరకు దాడిచేసిన జర్పుల సాయిచరణ్, తేజావత్ నాగేంద్రబాబు, జర్పులహరిదాసు, జర్పుల నాగమణి, జర్పుల మస్తాన్, జర్పుల విజయ, మూడ్ బుజ్జి తదితరులపై హత్యయత్నం కేసు నమోదు చేశామని, నిందితులు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.

# కూకట్‌పల్లిలో వ్యభిచార ముఠా ఆటకట్టు

**దాడిచేసి పట్టుకున్న సైబరాబాద్ పోలీసులు**

**హైదరాబాద్,మార్చి7 :** కూకట్‌పల్లిలో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠాను శనివారం సైబరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. వ్యభిచార ముఠా నిర్వహిస్తున్న ఇద్దరితో పాటు మరో అయిదు మంది కస్టమర్లను అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ముఠాకు చెందిన మరో ఇద్దరు మహిళలను రెస్క్యూ చేసినట్లు చెప్పారు. ఓ సమాచారం ఆధారంగా సైబరాబాద్‌కు చెందిన ఏహెచ్‌టీయూ బృందం రెయిడ్ నిర్వహించింది. సుమిత్రానగర్‌లో ఉన్న ఇండ్లపై దాడి నిర్వహించారు. రాకెట్ నడుపుతున్న వారితో పాటు కస్టమర్లను అదుపులోకి తీసుకున్నారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా కస్టమర్లను ఆకట్టుకుంటున్నట్లు గుర్తించారు. వారి నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూల్ చేస్తున్నట్లు తేల్చారు. భారీ మొత్తంలో డబ్బు వసూల్ చేసినా.. బాధితులకు మాత్రం తక్కువే ఇస్తున్నట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు.

# మహిళల రక్షణ సమాజం బాధ్యత

మొదటి పేజీ తరువాయి




రేవంత్ రెడ్డి అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా 'స్టాండ్ విత్ హర్' బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. మహిళా దినోత్సవం జరుపుకుంటేనే బాధ్యత తీరిపోయినట్టు కాదన్నారు. మహిళా నాయకత్వం నుంచి వచ్చిన పార్టీ ద్వారా రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. మహిళలను శక్తితో పోలుస్తామని.. కుటుంబ గౌరవాన్ని కూడా మహిళలతో పోలుస్తామని సీఎం తెలిపారు. మహిళలకు వేధింపులు.. పట్టణాలు, కాలేజీలు, పబ్లిక్ ప్రాంతాలకు మాత్రమే పరిమితం కాలేదని.. సోషల్ మీడియాలో మహిళలు ఎక్కువగా వేధింపులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. 'మనల్ని మనం సవరించుకొని మహిళల పట్ల మన బాధ్యతల్ని నెరవేర్చాలని సీఎం సూచించారు. మహిళల రక్షణ కోసం చట్టాలు చేస్తే బాధ్యత తీరిపోయిందని అనుకోవడం తప్పని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల కేటాయింపులు, రేషన్ కార్డులు అన్నీ మహిళల పేర్లమీద ఇస్తోందన్నారు. తెలంగాణలో స్వయం సహాయక సంఘాల మహిళలకు సోలార్ పవర్ ఉత్పత్తి చేసి విద్యుత్ శాఖకు అమ్మే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిందని తెలిపారు. ఈ నిర్ణయంతో మహిళలు అదానీ, అంబానీల స్థాయిలో విద్యుత్ రంగంలో పోటీ పడే అవకాశం ఇచ్చామన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం పలు అవకాశాలు కల్పిస్తోందని సీఎం రేవంత్ వెల్లడించారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం ద్వారా వారి స్వేచ్ఛ పెరిగిందని సీఎం తెలిపారు. జిల్లాల్లో ప్రభుత్వ స్థలాలు కేటాయించి మహిళల చేతుల్లో పెట్రోల్ బంకులు నిర్వహించే అవకాశాలు ఇచ్చామన్నారు. దేశంలోనే తొలిసారి మహిళా యూనివర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టింది తెలంగాణ ప్రభుత్వమని చెప్పారు. రాష్ట్రంలో చీఫ్ సెక్రటరీ సహా కీలక అధికార పదవుల్లో మహిళలకు అవకాశాలు కల్పిస్తున్న ప్రభుత్వం తమదే అని అన్నారు. మహిళల శక్తి, నైపుణ్యంపై ప్రభుత్వానికి సంపూర్ణ విశ్వాసం ఉందని స్పష్టం చేశారు. తెలంగాణను దేశంలోనే మహిళలకు అత్యంత భద్రత కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. మహిళల రక్షణను సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సీఎం రేవంత్ అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే కుటుంబం, రాష్ట్రం, దేశం బలపడుతుందన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో మహిళలు సైంటిస్టులు, డాక్టర్లు, ఇంజనీర్లుగా రాణిస్తున్నారని తెలిపారు. మహిళలు ధైర్యంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. ఎక్కడైనా మహిళలపై వేధింపులు జరిగితే నిలబడి ప్రశ్నించే ధైర్యం సమాజంలో రావాలన్నారు. కాలేజీలు, బస్టాండ్లు సహా ఎక్కడైనా జరిగే వేధింపు లను చూసీ చూడనట్టు ఉండడం కూడా నేరాన్ని ప్రోత్సహించడమే అని అన్నారు. సోషల్ మీడియా ద్వారా మహిళలపై సైబర్ వేధింపులు పెరుగుతున్నాయని తెలిపారు. మహిళలపై మార్ఫింగ్, ఫేక్ వీడియోలు వంటి సైబర్ నేరాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీజీపీ శివధర్‌రెడ్డి, నగర పోలీసు కమిషనర్ సజ్జనార్, సినీ నటుడు సాయి దుర్గతేజ్ తదితరులు పాల్గొన్నారు.

# శాంతియుత వాతావరణమమే శ్రీరామరక్ష

**లొంగిన మావోయిస్టులకు ఆర్థిక, ఆరోగ్య భద్రత**

**130 మంది మావోయిస్టులు లొంగుబాటు**

**గణపతి కూడా లొంగి పోవాలన్న సిఎం రేవంత్**

**హైదరాబాద్,మార్చి7 :**శాంతియుత వాతావరణంలోనే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. లొంగిపోయిన మావోయిస్టుల ఆర్థిక, ఆరోగ్య భద్రతకు భరోసా కల్పిస్తాం. ఇంకా అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు లొంగిపోవాలి. లొంగిపోయిన మావోయిస్టులకు అవసరమైన వసతులు కల్పిస్తాం అని అన్నారు. 130 మంది మావోయిస్టులు శనివారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎదుట లొంగిపోయారు. దేవ్‌జీకి చెందిన పీఎల్‌జీఏ కమిటీ మెత్తం సరెండర్ అయిపోయింది. మావోయిస్టులు తమ ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. మొత్తం 124 ఆయుధాలను సరెండర్ చేశారు. లొంగిపోయిన వారిలో దేవ్‌జీ, బడే చొక్కారావు గన్‌మెన్లు కూడా ఉన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ' మావోయిస్టుల లొంగుబాటుకు అధికారులు తీవ్ర కృషిచేశారు. పోలీసులు మావోయిస్టుల్లో నమ్మకం కల్పించారు. దేవ్‌జీ, ఆయన మిత్రబృందం కొన్ని ప్రతిపాదనలు చేశారు. తమ సమస్యలు పరిష్కరిస్తే లొంగిపోతామని చెప్పారు'. ఈరాష్ట్ర స్థాయిలో మేం చేయగలిగిందంతా చేస్తాం. మావోయిస్టు అగ్రనేత గణపతి కూడా లొంగిపోవాలి. అజ్ఞాతంలో ఉన్న తెలంగాణకు చెందిన ఏడుగురు కూడా.. త్వరగా లొంగిపోవాలి. లొంగిపోయిన వారికి పునరావాసం కల్పించాలని అమిత్ షా చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డు కూడా అందజేస్తాం. ప్రత్యేకమైన ఆరోగ్య భద్రత కార్డులు ఇస్తాం' అని రేవంత్ రెడ్డి హామీ చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టులకు అవసరమైన వసతులు కల్పిస్తాం. మావోయిస్టుల హోదాలను బట్టి ప్యాకేజీ కల్పిస్తాం. ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇల్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది' అని అన్నారు. పూర్తి వివరాలు వీడియోలో చూడండి.



## ఆయుధాలను అప్పగించిన మావోలు

**లొంగిన వారికి హోదాను బట్టి నగదు ప్రోత్సాహకం**

తెలంగాణలో మావోయిస్టుల లొంగుబాటు పరంపర కొనసాగుతోంది. ఇప్పటి వరకు తెలంగాణ పోలీసులు ముందు 721 మంది మావోయిస్టులు లొంగిపోయారు. మావోయిస్టుల నుంచి పోలీసులు ఇప్పటి వరకు 266 ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం తెలంగాణ నుంచి 7 మంది మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. శనివారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎదుట 130 మంది మావోయిస్టులు లొంగిపోయారు. దేవ్‌జీకి చెందిన పీఎల్‌జీఏ కమిటీ మొత్తం సరెండర్ అయిపోయింది. మావోయిస్టులు తమ ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. 124 తుపాకులు, 5205 తూటాలతో సహా మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసి పోయారు. మావోయిస్టులు సరెండర్ చేసిన ఆయుధాలలో రైఫిళ్లు ఇతర తుపాకులు ఉన్నాయి. లొంగిపోయిన వారిలో దేవ్‌జీ, బడే చొక్కారావు గన్‌మెన్లు కూడా ఉన్నారు. ఇక, లొంగిపోయిన వారికి తెలంగాణ ప్రభుత్వం నగదు బహుమతి ఇస్తోంది.

తెలంగాణ ప్రభుత్వం జనజీవన స్రవంతిలో కలిసిపోయిన డివిజనల్ కమిటీ సభ్యులకు ఐదు లక్షల రూపాయలు, ఏరియా కమిటీ సభ్యులకు నాలుగు లక్షల రూపాయలు, పార్టీ సభ్యులకు లక్ష రూపాయలు నగదు బహుమతి ప్రకటించింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల ప్రకారం ఆయుధాలతో సహా

జనజీవన స్రవంతిలో కలుస్తున్న క్యాడర్లకు అదనంగా ప్రోత్సాహకాలు అందనున్నాయి.

# నగరంలో నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్

**ముఠాను పట్టుకున్న పోలీసులు**

**హైదరాబాద్,మార్చి7 :** నగర ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెడుతూ కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను తయారు చేస్తున్న ఒక భారీ ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. హైదరాబాద్‌లోని లాలాపేటపరిధిలో నిర్వహిస్తున్న ఒక గోడౌన్ పై టాస్క్ ఫోర్స్ సికింద్రాబాద్ జోన్, లాలాగూడ పోలీసులు సంయుక్తంగా మెరుపుదాడులు నిర్వహించారు. సికింద్రాబాద్ జోన్ టాస్క్ ఫోర్స్ బృందానికి అందిన ముందస్తు సమాచారంతో లాలాగూడ(ఒజ్గీ÷జీణబీటజీ) పోలీసులతో కలిసి లాలాపేటలోని 'జానీ అల్లం వెల్లుల్లి పేస్ట్' గోడౌన్ పై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడిలో అత్యంత అపరిశుభ్రమైన వాతావారణంలో ప్రమాదకర రసాయనాలను ఉపయోగించి అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.అల్లం, వెల్లుల్లి పేస్ట్ ఎక్కువ రోజులు నిల్వ ఉండాలని, రంగు మారకుండా ఉండటానికి నిందితులు ఎసిటిన్ యాసిడ్ వంటి రసాయనాలు కలుపుతున్నట్లు తేలింది. ఈ సోదాల్లో దాదాపు 1,915 కిలోల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్, 30 కిలోల ఎసిటిక్ యాసిడ్, పేస్టు తయారీకి ఉపయోగించే యంత్రాలు, ఇతర ముడి సరకులు, ప్యాకింగ్ మెటీరియల్ ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు నీలా వెంకటేశ్వర్లుతోపాటు మరో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. మొత్తం నలుగురు నిందితులను తదుపరి విచారణ నిమిత్తం లాలాగూడ పోలీసులు తీసుకెళ్లారు. నకిలీ బ్రాండ్ లేబుల్స్ తో ప్యాకింగ్ చేసి నగరాల్లోని పలు కిరాణా దుకాణాలకు సరఫరా చేస్తున్నారని పోలీసులు తెలిపారు.

# గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో భట్టి భేటీ

**హైదరాబాద్,మార్చి7 :** మహారాష్ట్ర గవర్నర్‌గా బదిలీ పై వెళుతున్న జిష్ణు దేవ్ వర్మని లోక్ భవన్ లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు మర్యాదపూర్వకంగా కలిసారు. పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనతో పలు అంశాలను పంచుకున్నారు. అలాగే ఇంతకాలం తెలంగాణ గవర్నర్గా ఇక్కడి అభివృద్ధిలో భాగమైనందుకు అభినందించారు. ఇటీవలి మార్పుల్లో జిష్ణుదేవ్ వర్మ మహారాష్ట్ర గవర్నర్‌గా వెళుతున్నారు. తెలంగాణకు శుక్లా రానున్నారు.



# 99 రోజుల్లో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలి

## హౌసింగ్ బోర్డులోని 5వేల రిజిస్ట్రేషన్ల పక్రియ పూర్తిచేయాలి

## పోర్టల్‌ను ప్రారంభించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




**హైదరాబాద్,మార్చి7 :** ప్రజాపాలన– ప్రగతి నివేదిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా హౌసింగ్ బోర్డు పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఐదు వేల రిజిస్ట్రేషన్‌లను క్లియర్ చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ÷ూష్ట్రంలో ప్రజలకు పారదర్శకంగా వేగవంతమైన సేవలు అందించడానికి తెలంగాణ హౌ సింగ్ బోర్డు రూపొందించిన రిజిస్ట్రేషన్ పోర్టల్‌ను మంత్రి శనివారంనాడు సచివాలయంలో ప్రారంభించారు. అలాగే తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ 99 రోజుల కార్యాచరణ ప్రణాళికకు సంబంధించిన పోస్టర్‌ను కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనకు అనుగుణంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి నివేదిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ 99 రోజుల్లో హౌసింగ్ కార్పొరేషన్, హౌసింగ్ బోర్డ్ నిర్ధేశిరచుకున్న లక్ష్యాలను చేరుకునే విధంగా అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. హౌసింగ్ బోర్డ్ పరిధిలో ఇండ్లు, ప్లాట్లు, స్థలాలను వాయిదాల రూపంలో కొనుగోలు చేశారని ఇందులో కొంతమంది అసలు మరికొంతమంది వడ్డీలు చెల్లించాలని, ఇంకొంతమంది వాయిదాల గడువు ముగిసిపోయిందని ఈ విధంగా దాదాపు ఐదు వేల మంది తమ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిఉందని ఈసందర్భంగా అధికారులు మంత్రికి వివరించారు. దీనిపై మంత్రిగారు స్పందిస్తూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అసలు, వడ్డీ, ప్రస్తుత మార్కెట్ ధరలు వంటి

అంశాలను పరిగణనలోకి తీసుకొని రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు. ఈ పోర్టల్ వల్ల ప్రజలు ఎవరూ అధికారుల చుట్టూ తిరగవలసిన అవసరం ఉ ండదని, పూర్తి సమాచారం పోర్టల్ లోనే ఉంటుందన్నారు.

÷ళిటాయింపుదారులు తమ రిజిస్ట్రేషన్లు, చెల్లింపుల ధృవీకరణ మరియు ఇతర లావాదేవీల పర్యవేక్షణను ఒకే వేదిక ద్వారా సులభంగా పూర్తి చేసుకోవచ్చు. డిజిటల్ విధానం వల్ల పారదర్శకత పెరగడమే కాకుండా, పౌరులకు సేవలు మరింత చేరువవుతాయి. ఇది హౌసింగ్ బోర్డు మరియు అలాటీల మధ్య నమ్మకాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రజలకు సౌకర్యవంతమైన పాలన అందించడమే ప్రభుత్వ నిబద్ధత అని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో హౌసింగ్ బోర్డు ఎండీ వీపీ గౌతమ్, సీఈ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతుబంధు ఇంకా ఎప్పుడిస్తారు

## మూడు పంటలకని చెప్పి ఒకటి కూడా ఇవ్వరా

## కరీంనగర్ జిల్లాలో పర్యటించిన హరీష్ రావు



**కరీంనగర్,మార్చి7 :** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు ఇచ్చే తెలివి లేదా అని ప్రశ్నించారు. మూడు పంటలకు రైతుబంధు ఇవ్వాలని గతంలో ఆయన చెప్పారని.. కానీ ఇప్పుడు తన హయాంలో మూడు పంటలకు రైతుబంధు ఎగొట్టారని ధ్వజమెత్తారు. శనివారం కరీంనగర్ జిల్లాలోని చొప్పదండి నియోజకవర్గం గోపాలరావుపల్లిలో హరీశ్‌రావు పర్యటించారు. గోపాలరావుపల్లిలో పంట పొలాలను పరిశీలించారు. సాగునీరు లేక అన్నదాతలు పడుతున్న




కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖిలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు ఏ మొహం పెట్టుకుని రైతుల దగ్గరకు పోతారు....? అని హరీశ్‌రావు నిలదీశారు. పోలీసులు లేకుండా జనం దగ్గరకు ఎమ్మెల్యేలు, మంత్రులు వెళ్లగలరా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిందని కాంగ్రెస్ నేతలు చిల్లర మాటలు మాట్లాడుతారా..? అని ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్లే పంటలు పండుతున్నాయని స్పష్టం చేశారు. హైదరాబాద్‌కు తాగునీటిని అందించేది కాళేశ్వరం నీళ్లేతోనేనని తేల్చిచెప్పారు. తమపై చిల్లర వ్యాఖ్యలను బంద్ చేయాలని.. లేకపోతే తాము ఊరుకోమని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిందని అడ్డగోలు ఆరోపణలు చేస్తారా..? అని ఆగ్రహించారు. ఈ ప్రాజెక్టును ఎండబెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. మేడిగడ్డ పిల్లర్లను రేవంత్‌రెడ్డి సర్కార్ వెంటనే రిపేర్ చేయాలని డిమాండ్ చేశారు. రెండేళ్లలో కనీసం పది వేల ఎకరాలకు నీరిచ్చారా....? అని హరీశ్‌రావు ప్రశ్నల వర్షం కురిపించారు.

# సైబరాబాద్ మహిళా పోలీసుల ప్రతిభ

## ప్రతిభ, అంకితభావంతో గుర్తింపు

## శాంతిభద్రతల పరిరక్షణలో తమదైన ముద్ర



**హైదరాబాద్,మార్చి7 :** అక్టోబర్ 21న నిర్వహించిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా, మహిళా పోలీస్ అధికారులు క్రమశిక్షణతో కూడిన పరేడ్‌లో పాల్గొని అమరవీరులకు ఘన నివాళు లర్పించారు. ఈ కవాతులో వారు ప్రదర్శించిన ఏకాగ్రత, సమన్వయం, వృత్తిపరమైన అంకితభావం పరేడ్‌కు మరింత గౌరవాన్ని చేకూర్చింది. నగరానికి విచ్చేసే జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులకు ఇచ్చే 'గార్డ్ ఆఫ్ హానర్', వారి సమయపాలన మరియు బాధ్యతాయుతమైన విధి నిర్వహణకు అద్దం పడుతోంది. కేవలం పగటి విధులతోనే పరిమితం కాకుండా, మహిళా పోలీసులు రాత్రి సమయాల్లోనూ అత్యంత అప్రమత్తతతో సెంట్రీ విధులను నిర్వర్తిస్తున్నారు. కమిషనరేట్ పరిధిలోని కీలక ప్రాంతాలు, కార్యాలయాల వద్ద నిరంతరం కాపలా కాస్తూ నగర భద్రతా వ్యవస్థలో తమవంతు కీలక పాత్ర పోషిస్తున్నారు. వృత్తిపరమైన బాధ్యతలతో పాటు, హోం గార్డ్స్ వార్షికోత్సవం వంటి అధికారిక కార్యక్రమాల్లో మహిళా పోలీసులు వ్యాఖ్యాతలుగా వ్యవహరిస్తూ తమలోని సృజనాత్మకతను ప్రదర్శిస్తున్నారు. సభలను సమర్థవంతంగా నడిపిస్తూ, తమ వాగ్దాటితో కార్యక్రమ నిర్వహణను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు.

ప్రతిష్టాత్మక 'మిస్ వరల్డ్' పోటీల బందోబస్తు విధుల్లో మహిళా పోలీసులు ప్రదర్శించిన అత్యుత్తమ పనితీరును పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా కొనియాడారు. క్లిష్టమైన పరిస్థితుల్లో వారు చూపిన అంకితభావాన్ని గుర్తిస్తూ వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఉన్నతాధికారుల నుంచి అందుతున్న ఈ గుర్తింపు, ఇతర మహిళా సిబ్బందికి స్ఫూర్తినిస్తోంది. విధి నిర్వహణలో మహిళా పోలీసులు కేవలం శాంతిభద్రతల పరిరక్షణకే పరిమితం కాకుండా, ప్రాణదాతలుగానూ నిలుస్తున్నారు. పరిగి నుంచి విధులకు హాజరయ్యేందుకు వెళ్తున్న ముగ్గురు ఏఆర్ మహిళా కానిస్టేబుళ్లు దీపశ్రీ, వనజ, పద్మలు ప్రమాద స్థలిలో చూపిన చొరవ అభినందనీయం. ప్రమాదానికి గురైన బస్సు వెనుక ప్రయాణిస్తున్న వీరు, ఘటన జరిగిన ఐదు నిమిషాల్లోనే అక్కడికి చేరుకున్నారు. క్షణమాత్రం ఆలస్యం చేయకుండా, మరో ఏడుగురు కానిస్టేబుళ్లతో కలిసి మొత్తం 11 మంది క్షతగాత్రులకు సీపీఆర్ నిర్వహించి, వారి ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషించారు.




# మహిళల హాకీకి మహత్తర ఏర్పాట్లు

## అంతర్జాతీయ టోర్నీలకు కేరాఫ్ గా హైదరాబాద్

## తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు జితేందర్ రెడ్డి

**హైదరాబాద్,మార్చి7 :** మన జాతీయ క్రీడ అయిన హాకీ కి పునర్వైభవం తెచ్చేందుకు, హాకీ లో మహిళల భాగస్వామ్యం పెంచడానికి అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు వరల్డ్ మహిళల హాకీ క్వాలి÷ఫైంగ్ మ్యాచ్ లను గచ్చిబౌలిలో నిర్వహిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళల హాకీ క్వాలి÷యింగ్ టోర్నమెంట్ సందర్భంగా ఈ రోజు గచ్చిబౌలి స్టేడియంలో ఈ పోటీలో పాల్గొంటున్న ఎనిమిది జట్ల కెప్టెన్లతో కలిసి ఆయన ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మన జాతీయ క్రీడ హాకీ కి పునర్ వైభవం తీసుకురావడానికి క్రీడల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విధంగా స్ఫూర్తి కలిగించడానికి అంతర్జాతీయ మహిళా హాకీ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సోని బాలాదేవి మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వ క్రీడా శాఖ సహకారంతో గచ్చిబౌలి హాకీ స్టేడియంలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఈ టోర్నమెంట్ కు కావలసిన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా ఎటువంటి లోటుపాట్లు లేకుండా చేయగలిగామని అన్నారు. తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ దాదాపు రెండు నెలల నుంచి చేసిన కృషి ఫలితంగా గచ్చిబౌలిలో ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్ను నిర్వహించ బోతున్నామని తెలిపారు. ఈ ప్రెస్ మీట్ లో మాట్లాడిన 8 జట్ల కెప్టెన్లు తెలంగాణ క్రీడా శాఖ చేసిన ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వ ఆతిధ్యం ఆదరణ పట్ల ధన్యవాదాలు తెలియజేశారు. అద్భుతమైన హాకీ కి గచ్చిబౌలి ఆస్ట్రో టర్ఫ్ వేదిక కాబోతుందని అన్నారు.

# కామారెడ్డిలో చిన్నారుల మిస్సింగ్ కలకలం

## పదేళ్ల లోపు ఐదుగురు చిన్నారలు అదృశ్యం

## రంగంలోకి దిగిన పోలీసులు

**కామారెడ్డి,మార్చి7 :** కామారెడ్డి పట్టణంలోని గంటల వ్యవధిలోనే చిన్నారుల మిస్సింగ్ కలకలం రేపుతోంది. 24 గంటల వ్యవధిలో ఐదుగురు చిన్నారులు అదృశ్యం కావడం ఆందోళనకు గురిచేస్తోంది. అదృశ్యం అయిన వాళ్ళంతా 10 ఏళ్ల లోపు పిల్లలే. కామారెడ్డి పట్టణంలోని సంగి కాలనీకి చెందిన సింహాద్రి(10), విజయ్(9) అనే ఇద్దరు చిన్నారులు శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. సాయంత్రం దాటినా పిల్లలు రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోవైపు.. ఆర్బీ నగర్ కాలనీకి చెందిన అక్కాచెల్లెళ్లు అదృశ్యం కావడం మరింత భయాందోళనకు గురిచేస్తోంది. సీఫాత్(8), అయాత్(7), మరియం(5) అనే ముగ్గురు పిల్లలను వారి తండ్రి ఆటోలో తీసుకువెళ్లి ఒక షాపు వద్ద వదిలిపెట్టాడు. కొద్దిసేపటి తర్వాత తిరిగి వచ్చి చూసేసరికి అక్కడ వాళ్లు కనిపించకుండా పోయారు. చిన్నారు అదృశ్యంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు. బాధిత కుటుంబాల ఇంటికి వద్దకు వెళ్లిన కామారెడ్డి అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి వివరాలు సేకరించారు. కామారెడ్డి పట్టణ సీఐ నరహిరి, కామారెడ్డి రూరల్ సీఐ రామన్ ఆధ్వర్యంలో పోలీసులు 3 బృందాలుగా ఏర్పడి సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

# దహెగాం ఆస్పత్రిని సందర్శించిన కలెక్టర్

## ఆస్పత్రిలో అపరిశుభ్రతపై ఆగ్రహం

**కొమరంభీం,మార్చి7 :** పరిశుభ్రత అందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ హరిత అన్నారు. శనివారం దహెగాం మండలం కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రాంగణంలో నెలకొన్న అపరిశుభ్రతను చూసి ఆమె తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మీ ఇంట్లో అయితే ఇలాగే ఉంచుతారా? అని సిబ్బందిని ప్రశ్నించారు. ఆసుపత్రి పనితీరును, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. వార్డులో, ఆసుపత్రి ప్రాంగణంలో చెత్తాచెదారం పేరుకుపోయి ఉండటం గమనించి స్వయంగాచీపురు పట్టి ఊడ్చారు. రోగులు కోలుకోవాల్సిన చోట ఇలాంటి అపరిశు భ్ర వాతావరణం ఉండటంపై అక్కడి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిరోజూ ఆసుపత్రి పరిసరాలను పర్యవేక్షించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఉన్నతాధికారి హోదాలో ఉండి కూడా ఆమె స్వయంగా చీపురు పట్టి శుభ్రం చేయడం చూసి రోగులు, ఆసుపత్రి సిబ్బంది ఒక్కసారిగా విస్తుపోయారు. వేంటనే ఆమెతో కలిసి పారిశుద్ధ్య పనుల్లో పాల్గొన్నారు.

# బీర్‌బాటిల్‌లో చేపపిల్ల

**హైదరాబాద్,మార్చి7 :** బీర్ తాగేందుకు వెళ్లిన ఓ వ్యక్తికి ఊహించని షాక్ తగిలింది. బీర్ బాటిల్‌లో ఓ చేపపిల్ల ఈదుతూ కనిపించింది. హైదరాబాద్ నాచారం పరిధిలోని మల్లాపూ-ర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. మల్లాపూర్‌లోని జేపీ వైన్ షాపులో ఓ వ్యక్తి శుక్రవారం నాడు కింగ్‌ఫిషర్ లైట్ బీర్ కొనుగోలు చేశాడు. దాన్ని తాగేందుకు మూత ఓపెన్ చేయగానే అందులో చేప పిల్ల కదులుతూ కనిపించింది. దీంతో ఒక్కసారిగా అవాక్కయిన కస్టమర్.. వెంటనే షాపు నిర్వాహకుడిని ప్రశ్నించాడు. అయితే అతనితో వైన్ షాపు నిర్వాహకులు దు-రుసుగా ప్రవర్తించారు. బీర్లు తాము తయారుచేయమని.. ఏదైనా ఉంటే తయారుచేసిన కంపెనీని అడుక్కోవాలని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడు. దీంతో బీర్ బాటిల్‌లో చేప కదలడాన్ని వీడియో తీసి సోషల్‌మీడియాలో పోస్టు చేశారు.

# గూగుల్ సిఇవో పిచాయ్‌కు భారీ జీతం

## కంపెనీ లాభాల దృష్ట్యా జీతం 692 మిలియన్ డాలర్లకు పెంపు



**న్యూయార్క్,మార్చి7 :** గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ నాయకత్వంలో అల్ఫాబెట్ మార్కెట్ విలువ పైపైకి దూసుకెళుతోంది. కంపెనీ భారీ మొత్తంలో లాభాలు గడిస్తోంది. గతంలో 535 బిలియన్ డాలర్లు ఉన్న మార్కెట్ విలువ ఇప్పుడు 3.6 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. ఈ నేపథ్యంలో కంపెనీ ఉన్నతి కోసం ఎంతగానో కృషి చేస్తున్న సుందర్ పిచాయ్‌కి అల్ఫాబెట్ శుభవార్త చెప్పింది. తాజాగా, భారీ మొత్తంలో ప్యాకేజీని ప్రకటించింది. ది ఫైనాన్షియల్ టైమ్స్ శనివారం తెలిపిన వివరాల మేరకు.. పిచాయ్ ప్యాకేజీని రానున్న మూడేళ్లలో 692 మిలియన్ డాలర్లకు పెంచుతూ అల్ఫాబెట్ కీలక నిర్ణయం తీసుకుంది. మన ఇండియన్ కరెన్సీలో దాని విలువ 6,361 కోట్ల రూపాయలు. 692 మిలియన్ డాలర్లలో పిచాయ్ జీతం కేవలం 2 మిలియన్ డాలర్లు మాత్రమే. మిగిలినదంతా పనితీరు ఆధారిత స్టాక్స్ , పరిమిత స్టాక్స్ రూపంలో ఉండనుంది. పిచాయ్‌కి ఇచ్చే పనితీరు ఆధారిత స్టాక్స్ విలువ 126 మిలియన్ డాలర్లుగా ఉంది. పరిమిత స్టాక్స్ ద్వారా పిచాయ్ 84 మిలియన్ డాలర్లు అందుకోనున్నారు. అల్ఫాబెట్ అనుబంధ సంస్థలు వ్యోమోలో 130 మిలియన్ డాలర్ల విలువైన షేర్స్.. వింగ్ ఏవియేషన్‌లో 45 మిలియన్ డాలర్ల విలువైన షేర్లను యజమాన్యం కేటాయించింది. పిచాయ్ నాయకత్వం మీద ఉన్న నమ్మకంతోటే ప్యాకేజీ భారీగా పెంచినట్లు అల్ఫాబెట్ బోర్డ్ పేర్కొంది. కాగా, 53 ఏళ్ల సుందర్ పిచాయ్ 2004లో అల్ఫాబెట్‌లో ఉద్యోగంలో చేరారు. క్రోమ్‌ను అభివృద్ధి చేయటంలో కీలక పాత్ర పోషించారు. అంచెలంచెలుగా ఎదిగి గూగుల్ సీఈఓ స్థానానికి చేరుకున్నారు.

# మా దాడులు ఉద్దేశ్యపూర్వకం కాదు

## గల్ఫ్ దేశాలకు ఇరాన్ అధ్యక్షుడి క్షమాపణలు



**టెహ్రాన్,మార్చి7 :** గల్ఫ్ దేశాలకు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజిష్కియాన్ క్షమాపణలు చెప్పారు. ఇరుగుపొరుగు దేశాలపై క్షిపణులు, డ్రోన్ దాడులు చేసే ఉద్దేశం తమకు లేదని చెప్పారు. అయితే ఆయా దేశాలు తమ భూభాగాల నుంచి ఇరాన్‌పై దాడిని ప్రారంభించకుంటే తాము కూడా దాడి చేయమని అన్నారు. ఇరాన్ తాత్కాలిక నాయకత్వ మండలి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలు లక్ష్యంగా ఇరాన్ దాడులు కొనసాగిస్తున్న నేపథ్యంలో ఆ దేశం తాజా ప్రకటనతో ఉద్రిక్తతలు సడలే అవకాశం ఉంది. ఘర్షణల కారణంగా పొరుగుదేశాల్లో అనిశ్చితి తలెత్తడంపైనా పెజిష్కియాన్ క్షమాపణలు చెప్పారు. గల్ఫ్ ప్రాంతంలో సంక్షోభం మరింత విస్తరించాలని ఇరాన్ కోరుకోవడం లేదని అన్నారు. 'ఇరాన్ జరిపిన దాడులకు పొరుగు దేశాలకు వ్యక్తిగతంగా, ఇరాన్ తరఫున క్షమాపణలు తెలియజేసుకుంటున్నాను' అని ఆయన పేర్కొన్నట్టు ఏఎఫ్‌పీ వార్తా సంస్థ తెలిపింది. పొరుగుదేశాలపై దాడులు చేయమని ఇరాన్ అధ్యక్షుడు ఓవైపు చెబుతూనే మరోవైపు అమెరికా-ఇజ్రాయెల్ ఒత్తిళ్లకు తలవంచే ప్రసక్తే లేదని చెప్పారు. ఇరాన్ ప్రజలు ఎన్నడూ లొంగిపోరని, ఇరాన్‌ను లొంగదీసు కోవచ్చని అనుకునే వాళ్లు ఎప్పటికీ సక్సెస్ కారని, తమ దేశాన్ని తాము కాపాడుకుంటామని మీడియాతో మాట్లాడుతూ ఆయన చెప్పారు. కాగా, పొరుగుదేశాలపై దాడి చేయమని ఇరాన్ అధ్యక్షుడు ప్రకటించిన ప్పటికీ గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. దుబాయ్, అబుదాబి వంటి ప్రధాన నగరాల్లో పేలుళ్లు వినిపిస్తున్నాయి. క్షిపణులు, డ్రోన్‌లను ఎయిర్ డిఫెన్స్ సిస్టంలు అడ్డుకుంటున్న శబ్దాలు వినిపిస్తున్నాయి. విమానాశ్రయం సమీపంలో పెద్ద శబ్దం వినిపించడంతో దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆపరేషన్లను శనివారం నాడు నిలిపివేశారు. ఇది చిన్న ఘటనేనని, అయితే ప్రయాణికుల భద్రత రీత్యా విమాన సర్వీసులను రద్దు చేశామని అధికారులు తెలిపారు. తాజా ఘర్షణల్లో ప్రాణనష్టం కూడా భారీగానే ఉన్నట్టు చెబుతున్నారు. ఇరాన్‌లో 1,200మంది ప్రాణాలు కోల్పోగా, లెబనాన్‌లో సుమారు 200 మంది ఇజ్రాయెల్‌లో డజను మంది ప్రాణాలు కోల్పోయారు. ఉద్రిక్తతల నేపథ్యంలో ఆరుగురు అమెరికా సైనికులు మరణించినట్టు చెబుతున్నారు. గల్ఫ్ వ్యాప్తంగా ఎయిర్ ట్రావెల్‌కు అంతరాయం కలగడంతో వేలాది విమానాలు రద్దవుతున్నాయి. క్షిపణులు, డ్రోన్ దాడుల భయంలో పలు దేశాలు తమ గగనతలాన్ని మూసివేశాయి.

# హోలీ రంగుల తయారీ కర్మాగారంలో అగ్నిప్రమాదం

## నలుగురు మహిళా కార్మికులు దుర్మరణం

**చండీఘడ్, మార్చి7 :** హర్యానాలోని ఒక హోలీ రంగుల తయారీ కర్మాగారంలో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో నలుగురు మహిళా కార్మికులు మరణించగా 20 మంది గాయాలపాలయ్యారు. జింద్ జిల్లాలోని సఫిడాన్ నగరంలోగల భట్ కాలనీలో ఈ ప్రమాదం జరిగింది. అకస్మాత్తుగా చెలరేగిన మంటలు నిమిషాల వ్యవధిలోనే కర్మాగారం అంతా వ్యాపించాయి. దట్టమైన పొగ కమ్మేసింది. అసలేం జరిగిందో అర్థం కాక కార్మికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం కర్మాగారానికి బయటి నుంచి లాక్ వేసి ఉండటంతో కార్మికులు అక్కడి నుంచి బయటపడలేక ఇబ్బంది పడ్డారట. కొందరు ఫ్యాక్టరీలోనే చిక్కుకుపోయినట్టు తెలిసింది. ఇక ప్రమాద సమాచారం అందగానే ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది క్షతగాత్రులను రక్షించారు. వారిని సమీపంలోని సివిల్ ఆసుపత్రికి తరలించారు. కాగా, ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# ముగిసిన ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణ

## దానం , కడియంలపై తీర్పు రిజర్వ్

**హైదరాబాద్,మార్చి7 :** తెలంగాణ రాజకీయాల్లో గత ఏడాది కాలంగా ప్రకంపనలు సృష్టిస్తున్న ఎమ్మెల్యేల ఫిరాయింపుల వ్యవహారం ఇప్పుడు చివరిదశకు చేరుకుంది. బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ లో చేరిన ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శనివారం తుది విచారణను ముగించారు. సుప్రీ కోర్టు విధించిన గడువు శనివారంతో ముగియనుండటంతో, స్పీకర్ వెలువరించబోయే తీర్పుపై రాష్ట్ర వ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. ప్రధానంగా స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్లపై దాఖలైన పిటిషన్లపై స్పీకర్ ఛాంబర్ లో కీలక విచారణ జరిగింది. ఇప్పటికే పదిమంది ఎమ్మెల్యేలను ప్రశ్నించారు స్పీకర్, అనంతరం 8 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్ చీట్ ఇచ్చారు. దానం, కడియం కేసులో తీర్పు రిజర్వ్ ఉంచారు. ఉభయ పక్షాల వాదనలు విన్న అనంతరం ఈ కేసులో కూడా విచారణ ముగిసినట్లు స్పీకర్ కార్యాలయం ప్రకటించింది.

# అంతర్జాతీయ సంతాలి సభ వేదిక మార్పు

### రాష్ట్రపతిని స్వాగతించని మమత, మంత్రులు

### బెంగాల్ వ్యవహారంపై బహిరంగంగానే ముర్ము అసహనం

### మమత తన చిన్న చెల్లెలంటూ కితాబు



**కోల్‌కతా,మార్చి7 :** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం నాడు నార్త్ బెంగాల్‌లో అంతర్జాతీయ సంతాలి సదస్సును ప్రారంభించారు. అయితే తన పర్యటనలో పలు ప్రోటోకాల్ ఉల్లంఘనలు చోటుచేసు కోవడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. భద్రతా కారణాల పేరుతో బిధాన్‌నగర్‌లో జరగాల్సిన సదస్సు వేదకను బాగ్‌డోగ్రా ఎయిర్‌పోర్ట్ సమీపంలోని గోసాయిపూర్‌కు మార్చడం, వేదక చిన్నది కావడంతో గిరిజన కమ్యూనిటీకి చెందిన వారు పెద్దసంఖ్యలో రాలేకపోవడం వంటివి చోటుచేసుకున్నాయి. విమానాశ్రయంలో రాష్ట్రపతికి స్వాగతం పలికేందుకు రాకుండా ముఖ్యమంత్రి మమతాబెనర్జీ, ఆమె మంత్రులు దూరంగా ఉండిపోయారు. రాష్ట్రపతికి సిలిగురి మేయర్ దేవ్ స్వాగతం పలికారు. సభావేదిక మార్పుపై ద్రౌపది ముర్ము మాట్లాడుతూ.. ఇక్కడకు రావడం చాలా ఈజీగానే వచ్చానని, అయితే జనసమ్మర్ధం ఎక్కువగా ఉంటుందనే కారణంగా వేదికను మార్చినట్టు అధికార యంత్రాంగం చెప్పిందని తెలిపారు. 'రాష్ట్రపతి వచ్చి జనసమర్ధం లేని చోట ఈవెంట్‌లో పాల్గొని వెళ్లిపోతారని వారు అనుకుని ఉంటారు. వాళ్ల ఆలోచన ఏమిటో నాకు తెలియదు. ఈ పరిణామం చాలా బాధాకరంగా ఉంది' అని అన్నారు. రాష్ట్రపతి తన అసంతృప్తిని బాహాటంగానే వ్యక్తం చేసినప్పటికీ సీఎం విషయంలో ఆచితూచి మాట్లాడారు. మమతా బెనర్జీ తన చిన్న చెల్లెలని, తాను కూడా బెంగాల్ కూతుర్నేనని అన్నారు. ఏదో కారణం వల్ల ఆమెకు (మమతా బెనర్జీ) తనపై కోపం వచ్చి ఉండవచ్చని అన్నారు. ఆమెపై తానెలాంటి కంప్లయింట్ చేయదలచుకోలేదని చెప్పారు. అందరూ బాగుండాలని తాను కోరుకుంటున్నట్టు చెప్పారు. నార్త్ బెంగాల్‌లో ఆదివాసీలు, గోర్ఖాలు, రాజ్‌బన్సీలు, బెంగాలీలు కలిసిమెలసి ప్రశాంతంగా జీవిస్తుండటం, సామాజిక సామరస్యం చాటుకోవడంపై రాష్ట్రపతి ప్రశంసలు కురిపించారు. రాష్ట్రపతి తన పర్యటన సందర్భంగా స్థానిక గిరిజనులతో సంభాషించారు. ద్రౌపది ముర్ము రాక సందర్భంగా రాష్ట్రపతి కార్యాలయానికి ఉన్న గౌరవాన్ని మమతా బెనర్జీ దిగజార్చారని బీజేపీ మండిపడింది. ఇది టీఎంసీ ప్రభుత్వ నిర్వహణా వైఫల్యాన్ని చాటుతుందని పార్టీ నేత అమిత్ మాలవీయ అన్నారు.

# రాష్ట్రపతినే అవమానిస్తారా?

### ఇది సిగ్గుచేటైన వ్యవహారంగా పరిగణిస్తున్నాం

### ముర్ముకు బెంగాల్‌లో అవమానంపై మమతపై మోడీ ఆగ్రహం



**న్యూఢిల్లీ,మార్చి7 :** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పశ్చిమబెంగాల్‌లో పాల్గొనాల్సిన అంతర్జాతీయ సంతాల్ కాన్ఫరెన్స్ వేదికను మార్చడం, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆ కార్యక్రమానికి గైర్హాజరు కావడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర స్థాయిలో స్పందించారు. ఇది సిగ్గుచేటని, మునుపెన్నడూ జరగలేదని టీఎంసీ పైన, మమతా బెనర్జీ ప్రభుత్వంపైన మండిపడ్డారు. 'ఇది సిగ్గుచేటు వ్యవహారం. గతంలో ఎన్నడూ ఇలా జరగలేదు. ప్రజాస్వామ్యం, గిరిజన వర్గాల సాధికారతకపై నమ్మకం ఉన్న ప్రతి ఒక్కరి నైతికస్థైర్యాన్ని దెబ్బతీసేలా ఈ చర్య ఉంది. గిరిజన కమ్యూనిటీకి చెందిన రాష్ట్రపతి వెలిబుచ్చిన ఆవేదన దేశ ప్రజల మనసుల్లో ఆపార దుఃఖాన్ని కలిగించింది' అని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మోదీ ట్వీట్ చేశారు. పశ్చిమబెంగాల్‌లోని టీఎంసీ ప్రభుత్వం అన్ని హద్దులు అతిక్రమించిందనీ, రాష్ట్రపతికి జరిగిన అవమానానికి ప్రభుత్వ యంత్రాగానిదే బాధ్యత అని అన్నారు. ఉత్తర బెంగాల్‌లో అంతర్జాతీయ ఆదివాసీ సదస్సుకు హాజరయ్యేందుకు రాష్ట్రపతి సిలిగురికి వెళ్లారు. ప్రోటోకాల్ ప్రకారం రాష్ట్రపతికి ముఖ్యమంత్రి కానీ, మంత్రులు కానీ, సీనియర్ అధికారులు కానీ స్వాగతం పలకాల్సి ఉంది. అయితే అధికారికంగా స్వాగతించడానికి ప్రభుత్వం తరఫున ఎవరూ రాలేదు. ముందుగా అనుకున్న సదస్సు వేదికకు భద్రతా కారణాలతో ప్రభుత్వం అనుమతి కూడా ఇవ్వలేదు. ఈ పరిణామాలపై రాష్ట్రపతి అసహనం వ్యక్తం చేశారు. దీనికి కారణం ఏమిటో వారికే తెలియాలని, అయితే తనపై మమత ప్రభుత్వంపై ఎలాంటి ద్వేషంలేదని, ఆమె తనకు సోదరితో సమానమని అన్నారు. తాను కూడా బెంగాల్ కూతుర్నేనని గుర్తుచేశారు.

# ట్రంప్ తదితరుల హత్యకు ప్లాన్

### ఇరాన్ ప్రోద్బలంతో రంగంలోకి ఆసిఫ్ మర్చంట్

### పాకిస్థానీని దోషిగా తేల్చిన స్థానిక కోర్టు





**న్యూయార్క్,మార్చి7 :** డోనాల్ట్ ట్రంప్‌ను హత్య చేసేందుకు ప్లాన్ చేసిన కేసులో పాకిస్థానీ వ్యక్తిని అమెరికా న్యాయశాఖ శుక్రవారం దోషిగా తేల్చింది. ఇరాన్ ఆదేశాల ప్రకారం అతను అమెరికా రాజకీయ వేత్తలను హత్య చేసేందుకు ప్లాన్ చేసినట్లు అమెరికా న్యాయశాఖ ఆరోపించింది. నిందిత వ్యక్తిని ఆసిఫ్ మెర్చంట్‌గా గుర్తించారు. 2020లో ఇరాన్ మిలిటరీ నేత ఖాసిమ్ సొలేమని హత్యకు ట్రంప్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో ట్రంప్‌తో పాటు కొందరు అమెరికా నేతలను హత్య చేయాలని ఆసిఫ్ మెర్చంట్ ప్లాన్ చేశారు. దీని కోసం అమెరికాలో కొందర్ని రిక్రూట్ చేసేందుకు అతను ప్లాన్ చేశాడు. ఆసిఫ్ టార్గెట్‌లో ట్రంప్‌తో పాటు జో బైడెన్, నిక్కీ హేలీ కూడా ఉన్నారు. ఇరాన్ అధికారుల ఆదేశాల ప్రకారం అమెరికా నేతల హత్య కోసం ఆసిఫ్ రిక్రూట్మెంట్‌కు పాల్పడ్డాడని, దీన్ని ఉగ్రవాద చర్యగా భావిస్తున్నామని అమెరికా న్యాయశాఖ పేర్కొన్నది. న్యూయార్క్ సిటీ కోర్టు ఈ కేసుపై గత వారం వాదనలు జరుగుతున్నాయి. అయితే ఇరాన్‌లోని ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్‌తో కలిసి హత్యలకు ప్లాన్ చేసినట్లు ఆసిఫ్ మర్చెంట్ అంగీకరించాడు. అయితే టెహ్రాన్‌లో ఉన్న తన ఫ్యామిలీని కాపాడుకోవాలన్న భయంతో ఆ పనిచేసినట్లు చెప్పాడు. ఇరాన్ టాప్ కమాండర్ ఖాసీం సులేమాని హత్యకు ప్రతీకారంగా.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తో సహా ఇతర రాజకీయ నేతల హత్యకు కుట్రలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటోన్న పాకిస్థాన్ వ్యాపారి ఆసిఫ్ మర్చంట్ ను యూఎస్‌లోని బ్రూక్లిన్ న్యాయస్థానం దోషిగా తేల్చింది. ఈ మేరకు తాజాగా తీర్పు వెలువరించింది. ఇరాన్‌తో సంబంధాలున్న అతడికి ఈ కుట్ర కేసులో జీవిత ఖైదు పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ వద్ద ఆసిఫ్ మర్చంట్ శిక్షణ పొందినట్లు రుజువైందని అమెరికా న్యాయస్థానం పేర్కొంది. ప్రముఖ రాజకీయ నాయకుల హత్య కోసం ఐఆర్‌జీసీ తనను 2024లో అమెరికాకు పంపించిందని అతడు విచారణలో అంగీకరించాడు. అయితే, తుది లక్ష్యం ఎవరనేది తనకు వెల్లడించలేదని తెలిపాడు. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, మాజీ అధ్యక్షుడు జో బైడెన్ , 2024 అధ్యక్ష రేసులో ఉన్న నిక్కీ హేలితో సహా పలువురు కీలక రాజకీయ నేతలు తమ టార్గెట్‌లో ఉన్నట్లు పేర్కొన్నాడు. అయితే, ఈ ఆరోపణలను ఇరాన్ గతంలోనే ఖండించింది. ఈ హత్య కుట్రతో తమకు సంబంధం లేదని తెలిపింది. పాకిస్థాన్‌లోని పలు బ్యాంకుల్లో కొన్నేళ్ల పాటు పనిచేసిన ఆసిఫ్.. ఆ తర్వాత వస్త్ర వ్యాపారంలోకి అడుగుపెట్టాడు. అతడికి పాక్‌లో వివాహం కాగా.. ఇరాన్‌కు చెందిన మహిళనూ పెళ్లి చేసుకున్నట్లు తెలిసింది. 2024 ఏప్రిల్‌లో అమెరికాకు వచ్చిన ఆసిఫ్.. కిరాయి హంతకుల ఏర్పాటు కోసం ఓ వ్యక్తితో తన ప్రణాళిక గురించి చర్చించాడు. అయితే, ఆ వ్యక్తి అండర్‌కవర్‌లో ఉన్న అధికారిగా సమాచారం. అధ్యక్ష ఎన్నికల సమయంలో పెన్సిల్వేనియాలో ట్రంప్‌పై హత్యాయత్నం జరిగిన సంగతి తెలిసిందే. దీనికి ఒకరోజు ముందు అండర్‌కవర్ అధికారి సమాచారం మేరకు.. ఆసిఫ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పాక్‌కు పారిపోయేందుకు విమానం ఎక్కడానికి సిద్ధమవుతుండగా అతడిని పట్టుకున్నారు.

# గత అనుభవాలతో పాఠం..
# ఫైనల్ కోసం బ్యాటింగ్ పిచ్

### టీ20 ప్రపంచకప్ ఫైనల్ కోసం బ్యాటింగ్‌కు అనుకూలించే పిచ్

### ఎర్రమట్టి, నల్లమట్టి మిశ్రమంతో పిచ్ రూపకల్పన

### గత పరాజయాల నేపథ్యంలో పక్కా వ్యూహంతో పిచ్ ఎంపిక

### భారత జట్టు యాజమాన్యం సూచనలతో పిచ్‌లో మార్పులు



టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్ పోరుకు రంగం సిద్ధమైంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య జరగనున్న ఈ టైటిల్ ఫైట్‌కు బ్యాటర్లకు స్వర్గధామంలాంటి పిచ్‌ను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో ఎదురైన చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా భారత జట్టు యాజమాన్యం పక్కా వ్యూహంతో వ్యవహరించినట్లు సమాచారం.

ఒక ప్రముఖ ఆంగ్ల పత్రిక కథనం ప్రకారం ఫైనల్ మ్యాచ్ కోసం ఎర్రమట్టి, నల్లమట్టి మిశ్రమంతో కూడిన 'మిక్స్‌డ్ సాయిల్' పిచ్‌ను ఉపయోగిస్తున్నారు. ముంబైలో ఇంగ్లండ్‌తో జరిగిన సెమీఫైనల్ తరహాలోనే ఇది కూడా హై-స్కోరింగ్ మ్యాచ్‌కు వేదిక కానుంది. ముఖ్యంగా ఈ పిచ్‌లో నల్లమట్టి కంటే ఎర్రమట్టిని ఎక్కువగా వాడారు. ఎర్రమట్టి కారణంగా పిచ్‌పై బంతికి మంచి బౌన్స్ లభిస్తుంది. దీంతో రెండు ఇన్నింగ్స్‌లలోనూ బ్యాటింగ్ సులువుగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. స్పిన్నర్లకు పెద్దగా సహకారం లభించకపోవచ్చని, ఈ పిచ్‌పై 200 పరుగులు సాధారణ స్కోర్‌గా నిలుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ వ్యూహాత్మక నిర్ణయం వెనుక బలమైన కారణాలున్నాయి. 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్‌లో ఆస్ట్రేలియా చేతిలో భారత్ ఓటమికి నెమ్మదైన నల్లమట్టి పిచ్ ఒక కారణంగా నిలిచింది. అంతేకాకుండా ప్రస్తుత టోర్నీలో దక్షిణాఫ్రికాతో జరిగిన సూపర్ 8 మ్యాచ్‌లోనూ పిచ్ స్వభావం కారణంగా టీమిండియా భారీ తేడాతో ఓడిపోయింది. ఈ పరాజయాలను ఒక గుణపాఠంగా తీసుకున్న గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని భారత జట్టు యాజమాన్యం, ఫైనల్ పిచ్ విషయంలో ముందుగానే అప్రమత్తమైంది. లీగ్ దశలో కొన్ని పిచ్‌ల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన మేనేజ్‌మెంట్, స్థానిక క్యూరేటర్లతో చర్చించి తమ అభిప్రాయాలను స్పష్టంగా తెలియజేసినట్లు తెలుస్తోంది. "ఫైనల్ కోసం క్రీడాస్ఫూర్తినిచ్చే పిచ్‌ను అందిస్తారు. ఇందులో ఏ ఒక్క జట్టుకూ అనవసర ప్రయోజనం ఉండదు. ఎర్రమట్టి ఎక్కువగా ఉండటంతో బౌన్స్ లభిస్తుంది, అదే సమయంలో బ్యాటర్లకు పూర్తి అనుకూలంగా ఉంటుంది" అని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ పిచ్ టీమిండియా దూకుడైన బ్యాటింగ్ శైలికి సరిగ్గా సరిపోతుందని, సంజూ శాంసన్ వంటి మిడిలార్డర్ బ్యాటర్లు కీలక పాత్ర పోషించడానికి ఆస్కారం కల్పిస్తుందని భావిస్తున్నారు. ఈ టోర్నీలో ఈ మైదానంలో దక్షిణాఫ్రికా 213 పరుగులు చేసి కెనడాపై గెలిచింది. దీంతో ఫైనల్ మ్యాచ్ పరుగుల వరద పారించడం ఖాయంగా కనిపిస్తోంది.



### లక్ కోసం.. అహ్మదాబాద్‌లో
## టీమిండియా హోటల్ మార్పు

### నరేంద్ర మోదీ స్టేడియంలో గతంలో రెండు కీలక మ్యాచ్‌లు ఓడిపోయిన ఇండియా

### దీంతో ఫైనల్ కోసం జట్టు బస చేసే హోటల్‌ను మార్చిన బీసీసీఐ

### డ్రెస్సింగ్ రూమ్ కూడా మార్చాలని నిర్ణయం

అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో రేపు భారత్, న్యూజిలాండ్ మధ్య జరగనున్న టీ20 ప్రపంచకప్ ఫైనల్ పోరుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ ప్రతిష్ఠాత్మక మ్యాచ్‌కు ముందు టీమ్ ఇండియా బస చేసే హోటల్‌తో పాటు డ్రెస్సింగ్ రూమ్‌ను కూడా మార్చడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. గతంలో అహ్మదాబాద్‌లోని ఒక హోటల్‌లో బస చేసినప్పుడు టీమ్ ఇండియా రెండు కీలక మ్యాచ్‌లలో ఓడిపోయింది. దీంతో ఈసారి ఫైనల్ కోసం జట్టు బస చేసే హోటల్ ను బీసీసీఐ మార్చేసింది. గతంలో ఉన్న హోటల్‌కు బదులుగా ఈసారి టీమ్ ఇండియా తాజ్ స్కైలైన్ (ఝుయ ూాఎఙ్రీఱఅవ) హోటల్‌లో బస చేస్తోంది. అంతేకాదు, సాధారణంగా హోమ్ టీమ్‌కు కేటాయించే డ్రెస్సింగ్ రూమ్‌ను కాకుండా, ఈసారి విజిటింగ్ టీమ్ డ్రెస్సింగ్ రూమ్‌ను వాడాలని మేనేజ్మెంట్ నిర్ణయించినట్లు సమాచారం. ఫైనల్ మ్యాచ్ ప్రారంభానికి ముందు స్టేడియంలో ప్రేక్షకులను ఉర్రూతలూగించడానికి ఐసీసీ భారీ ఏర్పాట్లు చేసింది. అంతర్జాతీయ పాప్ స్టార్ రికీ మార్టిన్ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారు. 'దండియా క్వీన్' ఫాల్గుణి పాఠక్, సింగర్స్ సుఖ్బీర్, సుఖ్వీందర్ సింగ్ తమ ప్రదర్శనలతో సందడి చేయనున్నారు.

మరోవైపు, ముంబై నుండి అహ్మదాబాద్‌కు వెళ్లే విమాన టికెట్ల ధరలు పెరగడంతో, వెస్ట్రన్ రైల్వే రెండు ప్రత్యేక ఏసీ సూపర్ ఫాస్ట్ రైళ్లను అహ్మదాబాద్ కు నడుపుతోంది.

## పశ్చిమాసియా సంక్షోభం

### భారత్‌లో చిక్కుకుపోయిన విదేశీ క్రికెట్ జట్ల కోసం ప్రత్యేక విమానాలు

### మిడిల్ ఈస్ట్ గగనతల ఆంక్షలతో విమాన సర్వీసులకు అంతరాయం

ఐసీసీ ఏర్పాటు చేసిన ప్రత్యేక చార్టర్డ్ విమానాల్లో జట్ల పయనం నేడు ముంబై నుంచి లండన్‌కు బయలుదేరనున్న ఇంగ్లండ్ టీమ్ రేపు కోల్‌కతా నుంచి వెళ్లనున్న వెస్టిండీస్, దక్షిణాఫ్రికా జట్లు ఆరు రోజులుగా కోల్‌కతాలోనే చిక్కుకుపోయామన్న విండీస్ కోచ్ టీ20 ప్రపంచకప్ 2026లో తమ పోరాటం ముగిసినప్పటికీ, స్వదేశానికి వెళ్లలేక భారత్‌లోనే చిక్కుకుపోయిన విదేశీ జట్ల నిరీక్షణ ఎట్టకేలకు ఫలించింది. మిడిల్ ఈస్ట్‌లో నెలకొన్న యుద్ధ వాతావరణం, గగనతల ఆంక్షల కారణంగా విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో వెస్టిండీస్, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా జట్ల కోసం ఐసీసీ ప్రత్యేక చార్టర్డ్ విమానాలను ఏర్పాటు చేసింది. ఈ వారాంతంలో ఈ మూడు జట్లు భారత్ నుంచి బయలుదేరనున్నాయి. శనివారం సాయంత్రం ఇంగ్లండ్ జట్టు ముంబై నుంచి ప్రత్యేక విమానంలో నేరుగా లండన్‌కు బయలుదేరనుంది. ఇక మార్చి 1న భారత్ చేతిలో ఓడి సూపర్-8 దశలోనే నిష్క్రమించిన వెస్టిండీస్ జట్టు, సెమీస్‌లో కివీస్ చేతిలో ఓడిన దక్షిణాఫ్రికా జట్లు కోల్‌కతాలోనే ఉండిపోయాయి. ఈ రెండు జట్లు ఆదివారం ఒకే చార్టర్డ్ విమానంలో కోల్‌కతా నుంచి జోహన్నెస్‌బర్గ్‌కు వెళ్లనున్నాయి. అక్కడి నుంచి ఆ విమానం విండీస్ ఆటగాళ్లతో ఆంటిగ్వాకు వెళ్లనున్నట్లు సమాచారం. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు ఇరాన్‌పై దాడులు జరపడంతో మిడిల్ ఈస్ట్ మీదుగా వెళ్లే విమానాలకు ఆటంకం ఏర్పడటమే ఈ జాప్యానికి ప్రధాన కారణం. కాగా, వెస్టిండీస్ కోచ్ డారెన్ సామీ శనివారం 'డే 6' అంటూ తాము కోల్‌కతాలో చిక్కుకుపోయి ఆరు రోజులయిందని ట్వీట్ చేశారు. మరోవైపు విండీస్ స్పిన్నర్ అకీల్ హొసేన్.. "క్రిస్టియానో రొనాల్డో తన జెట్ పంపి నన్ను రక్షించడం బెటర్" అంటూ సోషల్ మీడియాలో సరదాగా పోస్ట్ చేశారు. అంతకుముందు జింబాబ్వే జట్టు కూడా ఢిల్లీలో ఇలాగే ఇబ్బంది పడగా, ఐసీసీ గురువారం అడిస్ అబాబా మీదుగా వారిని హరారేకు పంపించింది.



# మ్యాచ్ వర్షం వల్ల రద్దయితే విజేత ఎవరు?

### ఆదివారం టీ20 ప్రపంచకప్ ఫైనల్.. న్యూజిలాండ్‌తో భారత్ అమీతుమీ

### మూడోసారి విశ్వవిజేతగా నిలిచి చరిత్ర సృష్టించాలని చూస్తున్న టీమిండియా

### ఫైనల్ వర్షం కారణంగా రద్దయితే ఇరు జట్లను సంయుక్త విజేతలుగా ప్రకటన

### గత రికార్డుల్లో న్యూజిలాండ్‌పై భారత్‌దే స్పష్టమైన ఆధిక్యం

టీ20 ప్రపంచకప్ 2026 తుది అంకానికి చేరుకుంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా రేపు జరిగే ఫైనల్ పోరులో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్, న్యూజిలాండ్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచి మూడోసారి టీ20 విశ్వవిజేతగా నిలిచి చరిత్ర సృష్టించాలని టీమిండియా పట్టుదలగా ఉంది. మరోవైపు తమ తొలి పొట్టి ప్రపంచకప్‌ను ముద్దాడాలని కివీస్ జట్టు ఉవ్విళ్లూరుతోంది. ఈ నేపథ్యంలో ఈ హైవోల్టేజ్ మ్యాచ్ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




అయితే, ఇలాంటి కీలక మ్యాచ్‌లకు వర్షం ముప్పు ఎప్పుడూ ఉంటుంది. ఒకవేళ ఫైనల్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయితే పరిస్థితి ఏంటనే సందేహాలు చాలా మందిలో ఉన్నాయి. ఐసీసీ నిబంధనల ప్రకారం ఫైనల్ మ్యాచ్‌లో కనీసం 10 ఓవర్ల చొప్పున ఆట నిర్వహించేందుకు నిర్ణీత సమయంతో పాటు అదనంగా 120 నిమిషాల సమయం కేటాయిస్తారు. ఆదివారం ఈ సమయంలోగా కూడా ఆట సాధ్యపడకపోతే, మ్యాచ్‌ను మరుసటి రోజు, అంటే మార్చి 9న (సోమవారం) రిజర్వ్ డే రోజున నిర్వహిస్తారు. ఒకవేళ రిజర్వ్ డే నాడు కూడా వర్షం కారణంగా మ్యాచ్ పూర్తిగా రద్దయితే, ట్రోఫీని భారత్, న్యూజిలాండ్ జట్లకు పంచిపెట్టి సంయుక్త విజేతలుగా ప్రకటిస్తారు. ఐసీసీ టోర్నమెంట్ల చరిత్రలో ఇలాంటి ఘటన ఒకసారి చోటుచేసుకుంది. 2002లో భారత్, శ్రీలంక మధ్య జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్ వర్షం కారణంగా రిజర్వ్ డే రోజున కూడా రద్దయింది. దీంతో ఇరు జట్లను సంయుక్త విజేతలుగా ప్రకటించారు. అభిమానులకు ఊరటనిచ్చే విషయం ఏమిటంటే, ప్రస్తుతానికి అహ్మదాబాద్‌లో ఫైనల్ మ్యాచ్‌కు వర్షం ముప్పు లేదని వాతావరణ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఆకాశం నిర్మలంగా ఉంటుందని అంచనా. అయితే, తీవ్రమైన ఎండ ఆటగాళ్లకు పెద్ద సవాలుగా మారనుంది. నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్ వరకు చేరవచ్చని, రాత్రికి 23 డిగ్రీలకు పడిపోతుందని అంచనా. ఇక, ఇరు జట్ల మధ్య రికార్డులను పరిశీలిస్తే, పొట్టి ఫార్మాట్‌లో ఇప్పటివరకు 30 సార్లు తలపడగా, భారత్ 18 మ్యాచ్‌లలో, న్యూజిలాండ్ 11 మ్యాచ్‌లలో విజయం సాధించాయి. ఈ లెక్కల ప్రకారం టీమిండియాదే పైచేయిగా కనిపిస్తోంది.

# లక్ష్యం ఒక్కటే... ప్రేక్షకుల్ని సైలెంట్ చేయడం

### ఫైనల్ ముందు కివీస్ కెప్టెన్ శాంట్నర్ వ్యాఖ్యలు

"మా లక్ష్యం ఒక్కటే... అహ్మదాబాద్ స్టేడియంలోని లక్షలాది మంది ప్రేక్షకులను నిశ్శబ్దంలో ముంచెత్తడం". టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్స్‌కు ముందు న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ చేసిన వ్యాఖ్యలివి. స్వదేశంలో, నిండిన స్టేడియంలో టైటిల్ గెలవాలనే తీవ్ర ఒత్తిడి టీమిండియాపైనే ఉంటుందని, ఇదే తమకు అవకాశంగా మారుతుందని అతను ధీమా వ్యక్తం చేశాడు. ఇవాళ జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో శాంట్నర్ మాట్లాడుతూ... 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్ సమయంలో ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ చేసిన వ్యాఖ్యలను పునరావృతం చేశాడు. అహ్మదాబాద్ పిచ్ గురించి అడిగిన ప్రశ్నకు బదులిస్తూ... "నేనింకా పిచ్‌ను చూడలేదు. అది ఇంకా కవర్ల కిందే ఉంది. కానీ, ఇది ఫ్లాట్‌గా, హై స్కోరింగ్‌కు అనుకూలంగా ఉంటుందని అంచనా వేస్తున్నా" అని శాంట్నర్ తెలిపాడు. గతంలో ఇదే వేదికపై జరిగిన ఐసీసీ ఫైనల్ మ్యాచ్ పిచ్‌పై తీవ్ర చర్చ జరిగిన నేపథ్యంలో శాంట్నర్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. టీమిండియా బౌలింగ్ దళంపై, ముఖ్యంగా జస్ప్రీత్ బుమ్రాపై శాంట్నర్ ప్రశంసలు కురిపించాడు. "బుమ్రా గురించి ప్రతి ఒక్కరూ మాట్లాడుకోవాల్సిందే. అతను ప్రపంచ స్థాయి బౌలర్. ఇంగ్లండ్‌తో జరిగిన సెమీఫైనల్‌లో అతనే మ్యాచ్‌ను మలుపు తిప్పాడు" అని కొనియాడాడు. అయితే, భారత జట్టు బలం కేవలం ఒక్కరిపైనే ఆధారపడి లేదని స్పష్టం చేశాడు. "ముప్పు కేవలం బుమ్రా నుంచే కాదు. భారత జట్టులో ప్రతి ఒక్కరూ ప్రమాదకరమే. బ్యాటింగ్ లేదా బౌలింగ్‌లో వేర్వేరు సమయాల్లో ఒక్కొక్కరు ముందుకొచ్చి జట్టును గెలిపిస్తున్నారు. ఒక జట్టుగా ఇదే అత్యుత్తమ స్థితి" అని శాంట్నర్ విశ్లేషించాడు. గత దశాబ్ద కాలంగా పలు ఫార్మాట్లలో ప్రపంచకప్ ఫైనల్స్‌కు చేరినా ట్రోఫీని అందుకోలేకపోయిన న్యూజిలాండ్, ఈసారి ఆ కలను నెరవేర్చుకోవాలని పట్టుదలగా ఉంది. మరోవైపు ఈ వేదికపై నాకౌట్ మ్యాచ్‌లలో టీమిండియాకు అద్భుతమైన రికార్డు ఉండటం గమనార్హం.



# తెలంగాణ గద్దర్ ఫిల్మ్2025 విజేతలు వీరే..!

ప్రజాగాయకుడు గద్దర్ స్మారకార్థం తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన గద్దర్ ఫిలిం అవార్డ్స్ కు సంబంధించిన 2025 సంవత్సరపు విజేతల జాబితా అధికారికంగా ప్రకటించబడింది. జ్యూరీ సభ్యులు రెడీ చేసిన లిస్ట్ ను తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు అందజేయగా, ఈ సమావేశంలో నిర్మాత దిల్ రాజు, నటుడు తనికెళ్ల భరణి, రోజా రమణి, సంగీత దర్శకుడు మణిశర్మ, నటి ప్రగతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జ్యూరీ అవార్డు గ్రహీతల వివరాలను ప్రకటించారు. ఈ సందర్భంగా భారతీయ సినీ పరిశ్రమకు విశేష సేవలు అందించిన మెగాస్టార్ చిరంజీవికి ప్రతిష్ఠాత్మక ఎన్టీఆర్ నేషనల్ అవార్డును ప్రకటించగా, విలక్షణ నటి జయసుధకు అక్కినేని నాగేశ్వరరావు అవార్డు దక్కింది. పైడి జయరాజ్ అవార్డు కమల్ హాసన్‌కు, సినారే అవార్డు సుద్దాల అశోక్ తేజకు, నాగిరెడ్డి చక్రపాణి అవార్డు అశ్వినీదత్‌కు, రఘుపతి వెంకయ్య అవార్డు రమేష్ ప్రసాద్ కు, కాంతారావు అవార్డు ఆర్. నారాయణ మూర్తికి ప్రకటించారు. ఈ ఇయర్ మొత్తం 17 విభాగాల్లో గద్దర్ ఫిలిం అవార్డులను అందజేస్తున్నట్లు జ్యూరీ వెల్లడించగా, కొత్తగా సామాజిక సందేశాత్మక చిత్రాలకు ప్రత్యేక



పురస్కారాలతో పాటు డాక్టర్ సినారే, ఏఎన్ఆర్ పేర్లతో అవార్డులను కూడా ప్రవేశపెట్టినట్లు తెలిపారు. 2025 జనవరి 1 నుంచి 2025 డిసెంబర్ 31 మధ్య రిలీజైన సినిమాలను నామినేషన్లకు ఎంపిక చేశారు. గద్దర్ ఫిల్మ్ 2025 అవార్డు విజేతల లిస్ట్: ఉత్తమ నటుడు– నాగ చైతన్య (తండేల్) ఉత్తమ నటి– రష్మిక మందన్న (ది గర్ల్ ఫ్రెండ్) ఉత్తమ చిత్రం– రాజు వెడ్స్ రాంబాయి ఉత్తమ ద్వితీయ చిత్రం– దండోరా ఉత్తమ తృతీయ చిత్రం– ది ప్రీ వెడ్డింగ్ షో నేషనల్ ఇంటిగ్రిటీ సినిమా– తండేల్ ఉత్తమ పర్యావరణ చిత్రం– ఇగ్వా ఉత్తమ డెబ్యూ ఫీచర్ ఫిల్మ్– లిటిల్ హార్ట్స్ ఉత్తమ వినోదాత్మక చిత్రం– సంక్రాంతికి వస్తున్నాం ఉత్తమ సోషల్ మెసేజ్ చిత్రం– కోర్టు ఉత్తమ స్పెషల్ ఎఫెక్ట్స్ మూవీ– మిరాయ్ ఉత్తమ బాలల చిత్రం– అనగనగనా ఉత్తమ దర్శకుడు– సాయిలు (రాజు వెడ్స్ రాంబాయి) ఉత్తమ డెబ్యూ దర్శకుడు– సాయి మార్తాండ్ (లిటిల్ హార్ట్స్) ఉత్తమ సహాయ నటుడు– శివాజీ ఉత్తమ సహాయ నటి– భూమిక ఉత్తమ సంగీత దర్శకుడు– మార్క్ కె రాబిన్ (దండోరా) ఉత్తమ నేపథ్య గాయకుడు– అనురాగ్ కులకర్ణి(రాజు వెడ్స్ రాంబాయి) ఉత్తమ నేపథ్య గాయని– సాహితి చాగంటి (కన్నప్ప) ఉత్తమ హాస్యనటుడు– కృష్ణ తేజ (జిగ్రీస్) ఉత్తమ బాలనటుడు– రోహన్ రాయ్ (ప్రీ వెడ్డింగ్ షో) ఉత్తమ కథా రచయిత– గుణశేఖర్ (యుఫోరియా) ఉత్తమ స్క్రీన్ ప్లే రైటర్– అనిల్ రావిపూడి

ఉత్తమ గేయ రచయిత– నందకిశోర్ (కుబేర) ఉత్తమ సినిమాటోగ్రాఫర్– కార్తిక్ ఘట్టమనేని (మిరాయ్) ఉత్తమ ఎడిటర్– శ్రీకర్ ప్రసాద్ (మిరాయ్) ఉత్తమ ఆడియోగ్రాఫర్– ఎం.ఆర్ రాధాకృష్ణన్ (కిష్కిందపురి) ఉత్తమ కొరియోగ్రాఫర్– గిర గిర గిర (ఛాంపియన్) ఉత్తమ ఆర్ట్ డైరక్టర్– తోట తరణి (ఛాంపియన్) ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్– చంద్రకాంత్ (ఛాంపియన్) ఉత్తమ స్పెషల్ జ్యూరీ ఫిల్మ్– 23 ఉత్తమ నటుడు స్పెషల్ జ్యూరీ– చైతూ జొన్నలగడ్డ (రాజు వెడ్స్ రాంబాయి) ఉత్తమ నటి స్పెషల్ జ్యూరీ– అనంతిక (8 వసంతాలు) స్పెషల్ జ్యూరీ హీరో– రోషన్ (ఛాంపియన్)



## ‘ప్రేమకు థ్యాంక్స్’.. త్రిషను చూసి ఫిదా అవ్వాల్సిందేనా?

సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీలో కొన్నేళ్లుగా తన అందం, అభినయంతో ప్రేక్షకులను అలరిస్తున్న స్టార్ అండ్ సీనియర్ హీరోయిన్ త్రిష కృష్ణన్ మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారారు. తెలుగుతో పాటు తమిళం, మలయాళం భాషల్లో ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి స్టార్ హీరోయిన్ గా క్రేజ్ సంపాదించుకున్న త్రిష.. ఇప్పటికీ అదే గ్లామర్ తో అభిమానులను ఆకట్టుకుంటున్నారు. అదే సమయంలో సోషల్ మీడియాలో కూడా త్రిష ఎంతో యాక్టివ్ గా ఉంటారు. తరచూ తన ఫోటోలు, వీడియోలను అభిమానులతో పంచుకుంటూ ట్రెండింగ్ లో నిలుస్తుంటారు. తాజాగా ఆమె చీరకట్టులో దిగిన ఫోటోలు షేర్ చేయగా.. అవి ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారాయి. క్రీమ్ కలర్ పట్టుచీరలో త్రిష కనిపించిన ఆ ఫోటోలు అభిమానులను, సినీ ప్రియులను ఫిదా చేస్తున్నాయి. ఆ ఫిక్స్ ను షేర్ చేస్తూ “ఎల్లప్పుడూ నా అభిమానులుగా ఉండి నాకు ప్రేమ చూపిస్తున్నందుకు ధన్యవాదాలు” అంటూ క్యాప్షన్ రాసుకొచ్చారు. త్రిష ధరించిన క్రీమ్ కలర్ పట్టుచీరకు గ్రీన్ కలర్ స్టోన్స్ తో ఉన్న నెక్ సెట్ మరింత అందం తీసుకొచ్చింది. ఏదేమైనా సింపుల్ మేకప్, చిన్నపాటి చిరునవ్వుతో త్రిష మెరిసిపోయారని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు. అయితే త్రిష ఆ ఫోటోలు దిగిన సందర్భం కూడా ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ప్రముఖ తమిళ సినీ నిర్మాత, వ్యాపారవేత్త సురేష్ తనయుడి వివాహ రిసెప్షన్ గురువారం చెన్నైలో ఘనంగా జరిగింది. ఆ వేడుకకు త్రిష హాజరవ్వగా.. రిసెప్షన్ కు వెళ్లే ముందు రెడీ అయిన సమయంలో తీసుకున్న ఫోటోలనే ఇప్పుడు ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం విశేషం.

## ఒకే ఫ్రేమ్‌లో చిరంజీవి–సూర్య– అల్లు అర్జున్




అల్లు శిరీష్ – నైనిక రెడ్డిల వివాహ వేడుక 6 మార్చి 2026న హైదరాబాద్‌లో అత్యంత వైభవంగా జరిగింది. సినీ, రాజకీయ, వ్యాపార రంగాల ప్రముఖులు భారీగా తరలివచ్చిన ఈ వేడుకలో ఒక అపురూప దృశ్యం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ అద్భుతమైన ఫ్రేమ్‌లో మెగాస్టార్ చిరంజీవి, కోలీవుడ్ స్టార్ హీరో సూర్య , స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ ఒకే చోట కూర్చుని మాట్లాడుకుంటూ కనిపించారు. ఈ ముగ్గురు దిగ్గజాలు ఒకే ఫ్రేమ్‌లో కనిపించడం అభిమానులను ఉర్రూతలూగించింది. ప్రస్తుతం ఈ ఫోటో సోషల్ మీడియాలో విపరీతంగా షేర్ అవుతూ, లైక్‌ల వర్షం కురిపిస్తోంది. మెగాస్టార్ చిరంజీవి ఎప్పటిలాగే తన క్లాసీ అండ్ డిగ్నిఫైడ్ లుక్‌తో పెళ్లి వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆయన పెళ్లిలో తెల్లటి కాటన్ కుర్తా పైజామా ధరించారు. ఈ సింపుల్ ఎలిగెంట్ లుక్ మెగాస్టార్‌కు మరింత అందాన్ని తెచ్చిపెట్టింది. చిరంజీవి తన క్లాసీ లుక్‌తో మెగా అభిమానులను విపరీతంగా ఆకట్టుకున్నారు. తమిళ స్టార్ హీరో సూర్య కూడా పెళ్లి వేడుకకు తన స్టైలిష్ లుక్‌తో విచ్చేశారు. ఆయన ఆఫ్ వైట్ షేర్వానీ ధరించారు. ఈ షేర్వానీలో సూర్య చాలా హ్యాండ్సమ్‌గా కనిపించారు. సూర్య తన స్టైలిష్ లుక్‌తో తెలుగు అభిమానులను మెప్పించారు. సూర్యకు అల్లు కుటుంబానికి చాలా కాలంగా మంచి అనుబంధం ఉంది. సూర్య నటించిన బ్లాక్ బస్టర్ మూవీ –గజిని– సినిమా అల్లు అరవింద్ ప్రొడక్షన్‌లో వచ్చిన సంగతి తెలిసిందే.

స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ పెళ్లి వేడుకలో చాలా స్పెషల్‌గా కనిపించారు. ఆయన తెల్లటి ఎంబ్రాయిడరీ షేర్వానీ ధరించారు. ఈ షేర్వానీలో అల్లు అర్జున్ చాలా స్టైలిష్‌గా కనిపించారు. ఆయన ధరించిన ఈ షేర్వానీ స్పెషల్‌గా డిజైన్ చేసినట్టు స్పష్టంగా తెలుస్తోంది. అల్లు అర్జున్ తన స్టైలిష్ లుక్‌తో బన్నీ అభిమానులను ఖుషీ చేశారు. అన్నగా తమ్ముడి పెళ్లి పనులన్నీ దగ్గరుండి చూసుకున్నారు.

ఇక ఈ పెళ్లికి రాజకీయ రంగం నుండి కూడా హేమాహేమీలు విచ్చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి , ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్‌లు హాజరై శిరీష్–నైనిక జోడీని ఆశీర్వదించారు. సినీ, రాజకీయ, వ్యాపార రంగాల ప్రముఖుల కలయికతో అల్లు శిరీష్ వివాహం ఈ ఏడాది అత్యంత గ్రాండ్ సెలబ్రేషన్‌గా అలరించింది.

## ఉస్తాద్ పెంచుతాడా? తగ్గుతాడా?

తెలుగు సినిమా టికెట్ ధరలు ఎప్పుడూ పెరుగుతూనే ఉంటాయి. అందులోనూ స్టార్ హీరోల సినిమా టికెట్ ధరల గురించైతే చెప్పాల్సిన పనిలేదు. సినిమా సినిమాకు టికెట్ ధర అమాంతం పెంచేస్తారు. బ్లాక్ మార్కెట్ ధర గురించైతే చెప్పాల్సిన పనిలేదు. రెండు..మూడు..నాలుగు వేలు అంటూ ఎంతకైనా డిమాండ్ ను బ్లాక్ మార్కెట్ దందా నడుస్తుంది. టికెట్ ధర పెంచడానికి రకరకాల కారణాలు చెబుతుంటారు. ప్రముఖంగా సినిమా బడ్జెట్ ఆధారంగానే పెంచుతున్నామనే అంశం తెరపైకి వస్తుంది. ఇదంతా అందరికీ తెలిసిందే. అయితే త్వరలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన ‘ఉస్తాద్ భగత్ సింగ్’ భారీ అంచనాల మధ్య రిలీజ్ అవుతుంది. మార్చి 26 రిలీజ్ అనుకున్నారు. కానీ అంతకన్నా ముందే మార్చి 19 సినిమా రిలీజ్ అయ్యే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో టికెట్ ధర అంశం తెరపైకి వస్తోంది. ఈ సినిమాకు ఉస్తాద్ భగత్ సింగ్ నిర్మాతలు టికెట్ ధర పెంచుతారా? లేక పాత ధరల ప్రకారం రిలీజ్ చేస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది. తెలంగాణ రాష్ట్రంలో టికెట్ ధరలపై సన్నివేశం ఇలా ఉంది. టికెట్ ధరల పెంపు పై రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. సినిమా విడుదలకు 90 రోజుల ముందే టికెట్ ధరల పెంపు ఉత్తర్వులు ఇవ్వాలని అందులో పేర్కొంది. మరి ఈ రకమైన ముందొస్తు అనుమతి ఉస్తాద్ భగత్ సింగ్ సంపాదించాడా? లేదా? అన్నది క్లారిటీ లేదు. ఏపీలో అయితే టికెట్ ధరలు పెంచుకోవడానికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. రిలీజ్ కుముందు రోజైనా పెంపు అమలులోకి వచ్చేస్తుంది. పవన్ గత రెండు సినిమాలు



పెంచిన టికెట్ ధరలతోనే రెండు సినిమాలు రిలీజ్ అయ్యాయి. ఈ నేపథ్యంలో కొన్ని విమర్శలు కూడా వ్యకమయ్యాయి. టికెట్ ధరలు మరీ ఇంతలా పెంచేస్తే సామాన్యుడికి భారం కదా? అన్న అంశం తెరపైకి వచ్చింది. ఈ నేపథ్యంలో ‘ఉస్తాద్ భగత్ సింగ్’ టికెట్ ధరలపై ఆ ప్రభావం ఎలా ఉంటుంది అన్నది చూడాలి. మార్చి 19న –ధురంధర్ 2– ఎలాంటి టికెట్ ధరలు పెంచకుండానే రిలీజ్ అవుతుంది. పాన్ ఇండియాలో ఆ సినిమా ఎలాంటి టికెట్ హైక్ లేకుండా రిలీజ్ అవుతున్నప్పుడు ప్రభుత్వంలో ముఖ్యమంత్రి పదవిలో ఉన్న పవన్ సినిమా టికెట్ ధరలు పెంచకుండా రిలీజ్ చేయలేరా? అన్న ప్రశ్న ఉత్పన్న మవుతుంది. ఇది పవన్ కళ్యాన్ ని ఇరకాటంలో పెట్టేసే అంశంమే. గతంలో ‘కల్కి’ సినిమా రిలీజ్ సమయంలో టికెట్ ధరలు 1000 రూపాయలు పెంచుకోండని పవన్ చెప్పినట్లు నిర్మాత అశ్వినీ దత్ అన్నారు. కానీ అంత ధర పెట్టడం న్యాయం కాదని భావించి పెట్టలేదన్నారు. ఈ విషయంలో పవన్ పై అప్పట్లోనూ వ్యతిరేకత వ్యక్తమైన సంగతి తెలిసిందే.

# రాత్రిపూట సరిగ్గా నిద్ర పట్టడం లేదా వీటిని తింటే మేలు చేస్తాయి

ప్రస్తుత కాలంలో సహజంగా నిద్రపోవడం చాలా కష్టతరంగా మారిందని చెప్పవచ్చు. ఒత్తిడి, ఫోన్ లను ఎక్కువగా ఉపయోగించడం, శరీరానికి తగినంత శ్రమ లేకపోవడం వంటి కారణాల వల్ల నిద్రలేమి సమస్యతో బాధపడుతున్నారని చెప్పవచ్చు. అయితే వీటితో పాటు మధ్యాహ్నం తీసుకునే ఆహారం కూడా రాత్రిపూట నిద్రపై ప్రభావాన్ని చూపిస్తుందని వైద్యులు చెబుతున్నారు. మధ్యాహ్నం సమయంలో కొన్ని ఆహారాలను సరైన పద్దతిలో తీసుకోవడం వల్ల శరీరం సహజ నిద్రా విధానాలకు ఇవి మద్దతు ఇస్తాయని వైద్యులు చెబుతున్నారు. వీటిని తీసుకోవడం వల్ల నిద్ర నాణ్యత కూడా పెరుగుతుందని వారు తెలియజేస్తున్నారు. రాత్రి నిద్రకు సహాయం చేసే కొన్ని రకాల సూపర్ ఫుడ్స్ గురించి ఇప్పుడు తెలుసుకుందాం.



## బాదంపప్పు, అరటి పండ్లు..

గాఢ నిద్ర కోసం తీసుకోదగిన వాటిల్లో బాదంపప్పు ఒకటి. దీనిలో మెగ్నీషియం పుష్కలంగా ఉంటుంది. ఇది మెరుగైన నిద్రకు, విశ్రాంతికి తోడ్పడే ఖనిజం. సాయంత్రం 5 నుండి 7 గంటల సమయంలో నానబెట్టి తొక్క తీసిన బాదంపప్పును తీసుకోవాలి. ఇలా తీసుకోవడం వల్ల రాత్రి సమయంలో మేల్కొనడం తగ్గడంతో పాటు నాణ్యమైన నిద్రను సొంతం చేసుకోవచ్చు. అరటిపండ్లు కూడా నిద్రపోవడానికి సహాయం చేస్తాయని చెప్పవచ్చు. అరటిపండ్లల్లో పొటాషియం, మెగ్నీషియం, ట్రిప్టోఫాన్ వంటి పోషకాలు కలిసి ఉంటాయి. అరటిపండును తీసుకోవడం వల్ల నిద్ర చక్రాలను నియంత్రించే మెలటోనిన్ హార్మోన్ ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. భోజనం తరువాత లేదా రాత్రి భోజనం తరువాత అరటిపండును తీసుకోవడం వల్ల తగినంత విశ్రాంతిని పొందవచ్చు. ఇక నిద్రపోయే ముందు గోరు వెచ్చని పాలల్లో పసుపు కలిపి తీసుకోవడం వల్ల సహజంగా ప్రశాంతమైన నిద్రను సొంతం చేసుకోవచ్చు. ఇందులో చిటికెడు జాజికాయ పొడిని కలిపి తీసుకోవడం వల్ల తక్కువ నిద్ర ఉన్న వారికి ప్రయోజనకరంగా ఉంటుంది.

## చెర్రీలు..

అదే విధంగా నిద్రకు ఉపయోగపడే మరో ఆహారం చెర్రీలు. ఇవి శరీరాన్ని చల్లబరిచే శక్తిని కలిగి ఉంటాయి. నిద్రకు భంగం కలిగించే అసమతుల్యతలను తగ్గించడంలో ఇవి సహాయపడతాయి. వీటిని తీసుకోవడం వల్ల మెలటోనిన్ ఉత్పత్తి పెరుగుతుంది. సాయంత్రం సమయంలో తాజా చెర్రీపండ్లను తీసుకోవడం వల్ల రాత్రి సమయంలో సహజంగా నిద్ర వస్తుందని వైద్యులు తెలియజేస్తున్నారు. ఇటువంటి ఆహారాలను తీసుకుంటూనే జీవనశైలిలో మార్పులు కూడా చేసుకోవాలి. రాత్రిపూట స్క్రీన్ వాడకాన్ని తగ్గించడం, కెఫిన్ ను తక్కువగా తీసుకోవడం, రాత్రి సమయంలో ఆలస్యంగా భారీ భోజనాలు చేయడాన్ని తగ్గించడం, ఒత్తిడిని అదుపులో ఉంచుకోవడం వంటి వాటిని పాటించడం వల్ల సహజంగా నిద్రను సొంతం చేసుకోవచ్చు. అలాగే ఒకే సమయానికి నిద్రించడం, మేల్కొవడం వంటి వాటిని అలవాటు చేసుకోవాలి. ఇలా తగిన ఆహారాన్ని తీసుకుంటూ, చక్కటి జీవనశైలిని పాటించడం వల్ల నిద్ర సమస్యల నుండి సహజంగా బయటపడవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

# ఈ చిన్న టెస్టు చేస్తే మీరు కొన్న బెల్లంలో కల్తీ జరిగిందా, లేదా సులభంగా తెలుసుకోవచ్చు..!

చాలా మంది ఇండ్లల్లో ఎక్కువగా ఉపయోగించే పదార్థాల్లో బెల్లం కూడా ఒకటి. తీపి పదార్థాల తయారీలో, ఆయుర్వేద పానీయాల తయారీలో దీనిని ఎక్కువగా ఉపయోగిస్తూ ఉంటారు. బెల్లాన్ని తీసుకోవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. శరీరానికి కావల్సిన శక్తి లభిస్తుంది. శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. చాలా మంది చక్కెరకు బదులుగా బెల్లాన్ని ఉపయోగిస్తూ ఉంటారు. దీంతో దీని వాడకం ఎక్కువయ్యిందని చెప్పవచ్చు. బెల్లం వాడకం ఎక్కువవడం వల్ల బెల్లం కల్తీ సమస్య కూడా పెరుగుతోంది. బెల్లం తయారీలో చక్కెర పొడి, చాక్ పొడి, బేకింగ్ సోడా వంటి వాటిని ఉపయోగిస్తున్నారు. దీని వల్ల బెల్లం మంచి రంగులో కనిపించడంతో పాటు మృదువుగా, బరువుగా ఉంటుంది.



## టెస్టు ఇలా చేయాలి..

బేకింగ్ సోడా వంటి పదార్థాలు వెంటనే బయటకు కనిపించకపోయినా బెల్లం నాణ్యత, సహజ గుణాలు తగ్గిపోతాయి. ఇటువంటి కల్తీ బెల్లాన్ని వాడడం వల్ల జీర్ణక్రియపై చెడు ప్రభావం ఉంటుంది. పోషక విలువలు తగ్గుతాయి. బెల్లం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు తగ్గుతాయి. అయితే ఒక చిన్న ఇంటి పరీక్షను ఉపయోగించి బెల్లం నాణ్యతను, బెల్లంలో బేకింగ్ సోడా ఉందా లేదా అనే విషయాన్ని సులభంగా తెలుసుకోవచ్చు. ఈ పరీక్ష చేయడానికి గాను ముందుగా కొద్దిగా బెల్లాన్ని తీసుకుని మెత్తగా చేయాలి. దాదాపు పావు టీ స్పూన్ బెల్లాన్ని ఒక చిన్న గ్లాస్ లో తీసుకోవాలి. తరువాత ఇందులో 3 ఎమ్ఎల్ హైడ్రోక్లోరిక్ యాసిడ్ వేయాలి. తరువాత జరిగే ప్రతిచర్యను గమనించాలి. బుడగలు రాకపోతే బెల్లం స్వచ్ఛమైనది అని అర్థం. ఒకవేళ బుడగలు వస్తే బెల్లం కల్తీది అని అర్థం.

## FSSAI లైసెన్స్ నంబర్ ముఖ్యం..

బెల్లంలో సోడియం బైకార్బోనేట్( బేకింగ్ సోడా) ఉంటే అది హైడ్రోక్లోరిక్ యాసిడ్ తో కలిసి ప్రతిచర్యగా కార్బన్ డై యాక్సైడ్ ను విడుదల చేస్తుంది. ఈ గ్యాస్ కారణంగా బుడగలు ఏర్పడతాయి. ఇది బెల్లం కల్తీని తెలియజేస్తుంది. ఈ చిన్న పరీక్ష ద్వారా బెల్లం నాణ్యతను తెలుసుకోవచ్చు. కల్తీ బెల్లాన్ని వాడడం వల్ల ఆరోగ్యానికి హాని కలుగుతుంది. కనుక బెల్లం కొనే ముందు కొన్ని సూచనలను పాటించాలి. బెల్లం ప్యాకెట్ పై FSSAI లైసెన్స్ నంబర్ ఉందో లేదో చూసుకోవాలి. చాలా ప్రకాశవంతంగా, మెరిసే బెల్లాన్ని కొనకూడదు. నమ్మకమైన బ్రాండ్స్ లేదా విక్రేతల ద్వారా వద్ద మాత్రమే కొనుగోలు చేయాలి. కొద్దిగా గోధుమరంగు లేదా గాఢ రంగు బెల్లం తీసుకోవడం మంచిది. అలాగే తక్కువ ధరకు లభిస్తుంది కదా అని బెల్లాన్ని కొనకూడదు. తక్కువ ధరకు లభించే బెల్లాన్ని జాగ్రత్తగా చూసి కొనాలి. ఇక బెల్లంలో కల్తీ ఉందని అనిపిస్తే FSSAI ఆన్లైన్ కంప్లైంట్ పోర్టల్ ద్వారా, FSSAI మొబైల్ యాప్ ద్వారా లేదా స్థానిక ఫుడ్ సేఫ్టీ విభాగానికి ఫిర్యాదు చేయవచ్చు. కల్తీ ఉన్న బెల్లాన్ని కొనుగోలు చేసి తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి బదులుగా అనారోగ్యానికి గురి కావాల్సి వస్తుంది. కనుక బెల్లం కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత్త వహించడం చాలా అవసరం.



# ఇయర్‌ఫోన్స్ లేదా ఇయర్‌బడ్స్‌ను ఎక్కువ సమయం పాటు వాడితే ఏమవుతుంది

## ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి..?

ప్రస్తుత కాలంలో ఇయర్ ఫోన్స్ ను ఉపయోగించే వారి సంఖ్య ఎక్కువగా ఉందని చెప్పవచ్చు. వయసుతో సంబంధం లేకుండా అందరూ ఇయర్ ఫోన్స్ ను ఉపయోగిస్తున్నారు. ప్రయాణం చేసేటప్పుడు, ఇంట్లో ఖాళీగా కూర్చునప్పుడు, అలాగే తమ పని చేసుకుంటూనే కొందరూ ఇయర్ ఫోన్స్ ను ఉపయోగిస్తూ ఉంటారు. అయితే చాలా మంది చుట్టూ ఉన్న శబ్దాన్ని తగ్గించి తమ పనిపై దృష్టి పెట్టడానికి ఇయర్ ఫోన్స్ ను ఉపయోగిస్తూ ఉంటారు. వీటిని వాడడం వల్ల పనితీరు కొంత వరకు మెరుగుపడుతుందని చెప్పవచ్చు. అయితే ఇయర్ ఫోన్స్ ను ఎక్కువ సమయం లేదా ఎక్కువ శబ్దంతో ఉపయోగించడం వల్ల కొన్ని అనారోగ్య పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆడియోలజీ పరిశోధనలు తెలియజేస్తున్నాయి. ఎక్కువ సమయం ఇయర్ ఫోన్స్ ను వాడడం వల్ల తలెత్తే ఆరోగ్య సమస్యల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. వినికిడి శక్తి తగ్గే ప్రమాదం..

85 డెసిబెల్స్ కంటే ఎక్కువ శబ్దంతో ఎక్కువ సమయం వినడం వల్ల వినికిడి శక్తి తగ్గే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఇది చెవిలోని నాడులను శాశ్వతంగా దెబ్బతీయవచ్చు. ఇయర్ ఫోన్స్ ను ఎక్కువగా వాడే యువతలో ఈ సమస్య వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఇయర్ ఫోన్స్ ను ఎక్కువ సమయం వాడడం వల్ల చెవిలో నిరంతరం లాగుతున్నట్టు, మోగుతున్నట్టు లేదా ఏదో తెలియని శబ్దం వినబడినట్టు ఉంటుంది. అలాగే చాలా సమయం ఆడియో వినడం వల్ల చెవులు, మెదడు అలసిపోతాయి. దీని వల్ల మాటలు గుర్తించడం కష్టమవుతుంది. దృష్టి కూడా తగ్గుతుంది. ఇయర్ ఫోన్స్ ను ఎక్కువ సమయం వాడడం వల్ల బయట శబ్దాలు వినిపించకపోవడంతో పాటు చుట్టూ జరుగుతున్న విషయాలను మెదడు గమనించే సామర్థ్యం తగ్గుతుంది. అలాగే ప్రయాణం చేసేటప్పుడు ఇయర్ ఫోన్స్ ను వాడడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం కూడా ఎక్కువగా ఉంటుంది. 2025 లో జరిగిన కొన్ని పరిశోధనల ప్రకారం రోజుకు 2 గంటలకు పైగా ఇయర్ ఫోన్స్ వాడే వారిలో జ్ఞాపకశక్తి తగ్గడం వంటి సమస్యలు కూడా వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. కనుక ఇయర్ ఫోన్స్ ను ఎక్కువగా వాడే వారు జాగ్రత్తగా ఉండడం చాలా అవసరం.

## సరైన విధంగా ఉపయోగించాలి..

అలాగే వైద్యులు ఇయర్ ఫోన్స్ ను వాడే కొన్ని సురక్షితమైన మార్గాలను కూడా తెలియజేస్తున్నారు. చెవిలో నేరుగా శబ్దాన్ని పంపే ఇయర్‌బడ్ ల కంటే ఓవర్ ద ఇయర్ లేదా నాయిస్ క్యాన్సలింగ్ హెడ్‌ఫోన్స్ ను వాడడం మంచిది. ఇవి బయట శబ్దాన్ని తగ్గిస్తాయి కాబట్టి తక్కువ శబ్దంతో వినవచ్చు. ట్రాఫిక్ లేదా ఎక్కువ శబ్దాలు వచ్చే ప్రదేశం లో వాల్యూమ్ పెంచి వినాల్సి వస్తుంది. దీని వల్ల వినికిడి శక్తి దెబ్బతినే అవకాశం ఉంటుంది. కనుక అలాంటి సమయంలో కొద్దిగా విరామం తీసుకోవడం మంచిది. ఎలాంటి వినికిడి సమస్యలు లేకపోయినా అప్పుడప్పుడు వినికిడికి సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలి. దీని వల్ల చిన్న సమస్యలను కూడా ముందుగానే గుర్తించవచ్చు. ఇయర్ ఫోన్స్ పనిపై దృష్టి పెట్టడానికి మంచి సాధనంగా పని చేసినప్పటికి వీటిని సరైన విధంగా ఉపయోగించడం కూడా చాలా ముఖ్యమని వైద్యులు చెబుతున్నారు. తక్కువ శబ్దాలతో వినడం, విరామం తీసుకుంటూ వినడం, ఎక్కువ సమయం వినడాన్ని తగ్గించడం వంటివి చేయడం వల్ల ఇయర్ ఫోన్స్ ఉపయోగం హానిని కలిగించకుండా ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు.



# తాటి ముంజలను తింటున్నారా..?

**ఈ విషయాలను తెలుసుకోవాల్సిందే..!**

వేసవికాలం అనగానే ముందుగా అందరికీ గుర్తుకు వచ్చేవి మామిడిపండ్లు. అందరూ వీటిని తినడానికి ఎక్కువగా మక్కువ చూపుతారు. కానీ అదే సమయంలో రోడ్ల పక్కన బండ్లపై లభించే ఇతర పండ్లల్లో ఐస్ ఆపిల్ ఒకటి. వీటిని తెలుగులో ముంజలు, తాటి పండ్లు అని అంటారు. వేసవి కాలంలో లభించే ఈ ముంజలు శరీరానికి చల్లదనాన్ని ఇవ్వడంతోపాటు ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తాయి. ముంజలు తాటిచెట్టు నుండి లభ్యమవుతాయి. ముంజలు పెద్ద కొబ్బరికాయలా కనిపిస్తాయి. బయట గట్టిగా నలుపు రంగు తొక్క కలిగి ఉంటాయి. ముంజల లోపల తెల్లని రంగులో గుజ్జు ఉంటుంది. ఇవి నీటి శాతం ఎక్కువగా కలిగి లిచి పండు కంటే మృదువుగా ఉంటాయి. ముంజలు తాజా కొబ్బరి నీటి రుచిని కలిగి తక్కువ గాఢంగా ఉంటాయి. వేసవిలో వచ్చే వడదెబ్బ, డీహైడ్రేషన్ నుండి బయటపడడానికి వీటిని ఎక్కువగా తీసుకుంటూ ఉంటారు. ఇవి ఎక్కువ కాలం లభించవు. మార్చి నుండి జూన్ వరకు మాత్రమే లభిస్తాయి. వీటిలో నీటి శాతం ఎక్కువగా ఉండడం వల్ల త్వరగా పాడవుతాయి. కనుక వీటిని ఎక్కువగా దూర ప్రాంతాలకు తరలించరు. రోడ్ల పక్కన ఎక్కువగా అమ్ముతూ ఉంటారు.

## అనేక పోషకాలు..

ఇక వీటిని తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి మేలు కలుగుతుందని చెప్పవచ్చు. వీటిలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. కనుక శరీరానికి అవసరమైన నీటిని అందించడంలో ఇవి ఎంతో సహాయపడతాయి. వీటిలో సహజ చక్కెరలు ఉంటాయి కనుక ముంజలను తీసుకోవడం వల్ల తక్షణ శక్తి లభిస్తుంది. ముంజల్లో ఫైబర్, ప్రోటీన్, విటమిన్ ఎ, సి, ఇ, కె లతో పాటు ఐరన్, ఫాస్ఫరస్, పొటాషియం వంటి పోషకాలు ఉంటాయి. ఆయుర్వేదంలో తాటిపండును శరీర ఉష్ణాన్ని తగ్గించే పండుగా పేర్కొంటారు. వీటిని తీసుకోవడం వల్ల ఆమ్లత్వం, హీట్ రాషెస్, డీహైడ్రేషన్ వల్ల కలిగే తలనొప్పి వంటి సమస్యలు తగ్గుతాయి. వీటిలో తక్కువ క్యాలరీలు ఉంటాయి కనుక వేసవిలో తేలికపాటి స్నాక్స్ గా వీటిని తీసుకోవచ్చు.

## వెంటనే తినేయాలి..

అలాగే ముంజలను కొన్న రోజే తినడం మంచిది. ముంజలపై ఉండే సన్నని తొక్కను తీసేసి తినాలి. కొందరు వీటిపై బ్లాక్ సాల్ట్ వేసి తీసుకుంటారు. ఫ్రిజ్ లో ఉంచి చల్లగా అయిన తరువాత కూడా వీటిని తీసుకోవచ్చు. అలాగే వేసవికాలంలో ముంజలతో చల్లటి డెజర్ట్స్ కూడా తయారు చేసి తీసుకోవచ్చు. ఎల్లప్పుడూ తాజాగా, మృదువైన ముంజలను చూసి కొనుగోలు చేయాలి. చాలా గట్టిగా ఉన్న ముంజలు ఎక్కువగా పండిపోయే అవకాశం ఉంది. అలాగే వీటిని కొనుగోలు చేసిన వెంటనే తినడం మంచిది. ఫ్రిజ్ లో కూడా ఇవి ఎక్కువ కాలం నిల్వ ఉండవు. ఫ్రిజ్ లో ఉంచడం వల్ల కేవలం ఒకటి నుండి రెండు రోజులు మాత్రమే ఇవి నిల్వ ఉండే అవకాశం ఉంది. ఈ విధంగా వేసవిలో లభించే ఈ ముంజలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, వేసవిలో మామిడిపండ్లతో పాటు వీటిని కూడా తీసుకునే ప్రయత్నం చేయాలని వైద్యులు సూచిస్తున్నారు.

# విడాకులు వచ్చేవరకు విజయ్ ఇంట్లోనే ఉంటాను

**అలా ఉండేందుకు ఆదేశాలు ఇవ్వండి**

**కోర్టును కోరిన విజయ్ భార్య సంగీత**

**తన వ్యక్తిగత జీవిత చికాకులపై స్పందించిన విజయం**

**కార్యకర్తలు ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాని సూచన**

**చెన్నై,మార్చి7 :** తమిళ నటుడు, టీవీకే అధ్యక్షుడు విజయ్ నుంచి విడాకులు కోరుతూ పిటిషన్ వేసిన ఆయన భార్య సంగీత తాజాగా మరో పిటిషన్ వేశారు. నివాస హక్కులు కోరుతూ ఈ పిటిషన్ వేశారు. వివాహం తర్వాత తాము కలిసి నీలాంగరైలో నివసించిన వైవాహిక గృహంలో ఉండేందుకు తనకు అనుమతి ఇవ్వాలని కోరుతూ చెంగల్పట్టులోని జిల్లా కోర్టును ఆమె ఆశ్రయించారు. దీనిపై తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేయాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. విజయ్ నుంచి విడాకులు కోరడంతో ఇంట్లో ఉండేందుకు తనకు అనుమతి ఇవ్వడంలేదని కోర్టుకు సంగీత తెలిపారు. తాను లండన్‌కు చెందిన వ్యక్తిని కావడంతో మరెక్కడా ఉండేందుకు అనుమతి లేదన్నారు. తనకు విజయ్ ఇంట్లో ఉండే హక్కు ఉందని కోర్టుకు వివరించారు. విడాకుల పక్రియ పూర్తయ్యేంత వరకూ నీలాంగరై ఇంట్లో ఉండేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. సంగీత ఇటీవల 28 ఏళ్ల తమ వైవాహిక జీవితానికి ఉద్వాసన పలుకుతూ వివిధ కారణాల రీత్యా విడాకులు ఇవ్వాలని ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించారు. విజయ్‌కు వివాహేతర సంబంధం ఉందని, అది తనకు తన పిల్లలకు అవమానంగా ఉందని ఆమె పేర్కొన్నారు. ఏప్రిల్ 20న ఈ కేసు విచారణకు రానుంది. యూకేకు చెందిన సంగీత లండన్‌లో చదువుకున్నారు. 1999 ఆగస్టు 25న విజయ్‌ను వివాహమాడారు. వీరికి సంజయ్ అనే కుమారుడు, దివ్వ అనే కుమార్తె ఉన్నారు. తనపై ముసురుకున్న వివాదాలపై సినీ నటుడు, టీవీకే అధ్యక్షుడు విజయ్ ఎట్టకేలకు స్పందించారు. ఆ సమస్యల కారణంగా అభిమానులు, ప్రజలు ఇబ్బంది పడుతుంటే బాధగా ఉందని వ్యాఖ్యానించారు. టీవీకే ఆధ్వర్యంలో చెన్నై సమీపంలోని చెంగల్పట్టు వద్ద నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో విజయ్ పాల్గొని మాట్లాడారు. వ్యక్తిగత వివాదాల గురించి తాను చూసుకుంటానని, పార్టీ కార్యకర్తలంతా ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. మహిళలకు ప్రత్యేక వరాలు ప్రకటిస్తూ మేనిఫెస్టో విడుదల చేశారు. ఇటీవల నాకు ఎదురవుతున్న సమస్యలు, ఇబ్బందుల గురించి మీరు ఆలోచించాల్సిన పనిలేదు. వాటిపై మీరు పోరాటం చేసి వాళ్లను బాధించాల్సిన అవసరం అంతకన్నా లేదు. అవన్నీ నేను చూసుకుంటాను. మీరు చేయాల్సిందల్లా ప్రజా సమస్యలపై పోరాటం చేయడమే. నా వ్యక్తిగత విషయాలను ఎలా పరిష్కరించుకోవాలో నాకు బాగా తెలుసు. ఇవన్నీ మిమ్మల్ని ఇబ్బంది పెడుతుంటే నాకు బాధగా ఉంది. వాటి సంగతి తర్వాత చూస్తా అని మహిళా దినోత్సవ కార్యక్రమంలో విజయ్ అన్నారు.

# ఖమేనీ నలుగురు కుమారులు క్షేమం

**ఆన్‌లైన్‌లో ఫోటోలు విడుదల**

**టెహ్రాన్,మార్చి7 :** ఇజ్రాయెల్ తొలి దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లి అలీ ఖమేనీ మృతి తీవ్ర సంచలనమైంది. దీంతో మధ్యప్రాచ్యంలో ఒక్కసారిగా ఉద్రిక్తతలు తలెత్తాయి. ఇజ్రాయెల్ దాడుల్లో ఖమేనీపాటు ఆయన కొడుకుల్లో ఒకరు మృతి చెందినట్టు తొలి వార్తలు వచ్చాయి. అయితే తాజా సమాచారం ప్రకారం ఆయన కుమారులు నలుగురు క్షేమంగా ఉన్నారు. ఇందుకు సంబంధించిన ఫోటోలు ఆన్‌లైన్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. ఖమేనీ మరణించినప్పటికీ ఆయన నలుగురు కొడుకులైన ముస్తాఫ్ ఖమేనీ, మొజ్తబా ఖమేనీ, మసూదు ఖమేనీ, మెయిసమ్ ఖమేనీలు సురక్షిత ప్రాంతంలో ఉన్నట్టు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతోంది. వారి ఫోటోలు సర్క్యులేట్ అవుతున్నాయి. ఖమేనీ మృతి తర్వాత సుప్రీం లీడర్ ఎంపిక కోసం అన్వేషణ జరుగుతున్న తరుణంలో ఫోటోలు విడుదల కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఖమేనీ తన వ్యక్తిగత జీవితాన్ని ఎప్పుడూ రహస్యంగా ఉంచేవారు. అరుదుగా మాత్రమే ఆయన తన భార్య, కుమారులతో కనిపించేవారు. క్రియాశీలక రాజకీయాలకు కుమారులను దూరంగా ఉంచేవారు. ఆయన కుటుంబంలోని ఒకరిద్దరు మాత్రమే రాజకీయాల్లో ప్రభావం కనబరచే వారని చెబుతుంటారు. ఖమేనీ భార్య మన్సూరే భోజస్తే బాఘెర్జాదే ఎప్పుడూ ప్రచారానికి దూరంగానే ఉండేవారు. ఇరాన్‌లోని ఓ ప్రముఖ వ్యాపారి కుటుంబంలో 1947లో ఆమె జన్మించారు. 1964 ఖొమేనీని వివాహమాడారు. ఇరాన్‌లోని తలెత్తిన ఇస్లామిక్ విప్లవంతో సహా ఇరాన్ రాజకీయ చరిత్రలో సంక్లిష్ట పరిస్థితి ఏర్పడినప్పడల్లా ఖమేనీకి ఆమె బాసటగా నిలిచారు. ఇజ్రాయెల్ ఇటీవల జరిపిన దాడల్లో ఖమేనీ మరణించడంలో ఆయన కుటుంబం భవిష్యత్తు, ప్రతీకార చర్యలకు దిగే అవకాశాలపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇదే సమయంలో ఖమేనీ స్థానంలో ఎవరు వచ్చినా వాళ్లను లక్ష్యంగా చేసుకుంటామని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ ఇటీవల కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ దేశ ప్రభుత్వం నియమించిన ఏ నాయకుడినైనా నిస్సందేహంగా అంతం చేస్తామని హెచ్చరించారు. ఎక్కడ దాక్కున్నా వదిలిపెట్టేది లేదన్నారు. ఈ క్రమంలోనే ఖమేనీ రెండో కుమారుడు మజ్తబాను తమ సుప్రీం నేతగా ఇరాన్ అసెంబ్లీలోని కీలక నేతలు ఎన్నుకున్నట్టు ప్రచారం జరుగుతోంది.

# శాంతి భద్రతల్లోనే కాదు.. క్రీడల్లోనూ మగువలే మేటి

**క్రీడారంగంలో సత్తా చాటుతున్న మహిళా పోలీసులు**

**హైదరాబాద్,మార్చి7 :** విధి నిర్వహణలో కఠినంగా ఉంటూనే, మరోవైపు క్రీడా మైదానంలో పతకాల పంట పండిస్తున్నారు సైబరాబాద్ మహిళా పోలీసులు. శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తూనే, యోగా, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్ వంటి విభాగాల్లో జాతీయ స్థాయి ప్రతిభను కనబరుస్తూ తోటి సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వారి విజయగాథలపై ప్రత్యేక కథనం.రాజమణి కేవలం పోలీస్ విధులకు మాత్రమే పరిమితం కాకుండా, వివిధ క్రీడల్లో తనదైన ముద్ర వేశారు. స్విమ్మింగ్ 50 మీటర్ల ఫ్రీ స్టైల్ విభాగంలో బంగారు పతకాన్ని సాధించారు. ట్రెడిషనల్ యోగాసన (18-28 ఏళ్ల విభాగం)లో స్వర్ణ పతకం కైవసం చేసుకున్నారు.5000 మీటర్లు, 10000 మీటర్ల ట్రాక్ ఈవెంట్లలో రెండు వెండి పతకాలు సాధించి తన వేగాన్ని నిరూపించుకున్నారు. ఆర్.ఎస్.ఐ గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న రోహిణి, బ్యాడ్ మిన్ టన్ క్రీడల్లో తిరుగులేని ప్రతిభను చాటుతున్నారు. ఎన్.జి.ఓ ఓపెన్ విభాగంలో బంగారు పతకం సాధించారు. టేబుల్ టెన్నిస్ ఓపెన్ డబుల్స్ విభాగంలో వెండి పతకాన్ని, టీమ్ ఈవెంట్లో కాంస్య పతకాన్ని గెలుపొందారు. మహిళా కానిస్టేబుల్ సరిత యోగా రంగంలో విశేష ప్రతిభ కనబరుస్తున్నారు. ఓపెన్ డబుల్స్ లో వెండి పతకం, ఓపెన్ సింగిల్స్ లో కాంస్య పతకం సాధించారు.కబడ్డీ పోటీల్లో డి. మంజుల, టి. ప్రత్యూష, ఎం. మమత, పి. స్వర్ణలత, సాయి ప్రసన్న, వాణిశ్రీ, బి. గంగ, జి. స్వాతి, ఈ. రేణుక, కె. రాధిక, ఎస్. శిరీష మరియు రాధికల బృందం కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. టగ్ ఆఫ్ వార్ (తాడు లాగుట) విభాగంలో సిహెచ్. సంధ్యారాణి, పి. సౌందర్య, ఎం. రజిత, పి. మీన, ఎస్. శిరీష, కె. కవిత, ఎం. రేణుక, డి. శ్రీదేవి, వి. సునీత, బి. గంగలు బ్రాంజ్ మెడల్స్ సాధించారు. వీటితో పాటు టేబుల్ టెన్నిస్, యోగాలో రోహిణి, ఈ. సునీత, సత్యమ్మ, సువర్ణలు మరిన్ని పతకాలను సాధించారు. అ÷-లథెటిక్స్ ఫీల్డ్ ఈవెంట్స్ లో పి. శ్వేత, ఎ. గాయత్రిలు కాంస్య పతకాలు గెలుచుకున్నారు.

# సైబరాబాద్‌లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

**వివిధ రంగాల మహిళా ప్రముఖుల హాజరు**

**క్రమశిక్షణ, పట్టుదలతోనే రాణిస్తామని పలువురు సూచన**



హైదరాబాద్,మార్చి7(ఆర్ఎన్ఎ): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈరోజు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా జీహెచ్ఎంసీ కమిషనర్ సృజన హాజరుకాగా, గౌరవ అతిథులుగా 'సేవ్' ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు విజయ్ రామ్, ప్రముఖ పోషకాహార నిపుణులు, మనస్తత్వవేత్త డాక్టర్ నిదా ఫాతిమా, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, వివిధ విభాగాల డీసీపీలు, పోలీస్ అధికారులు, మినిస్టీరియల్ స్టాఫ్, జీహెచ్ఎంసీ అధికారులు, రైతులు మరియు వివిధ రంగాలకు చెందిన మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు. 'గివ్ టూ గైన్' థీమ్ తో ఈ సంవత్సరం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. మహిళా శక్తిని గౌరవించడం, సమాజంలో వారి పాత్రను గుర్తించడం, ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగింది. సమాజంలో సానుకూల మార్పులకు మహిళా సాధికారత ఎంతో కీలకమని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు. ఏ రంగంలోనైనా రాణించాలంటే క్రమశిక్షణ, స్పష్టమైన లక్ష్యం మరియు నిరంతర కృషి అవసరమని సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన అన్నారు. చిన్నప్పటి నుంచే సమాజానికి సేవ చేయాలనే తపన తనలో ఉండేదని, తన తండ్రి బాలరామయ్య స్ఫూర్తితోనే సివిల్ సర్వీసెస్ వైపు అడుగులు వేసినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయం నుండి పొలిటికల్ సైన్స్ లో మాస్టర్స్ పూర్తి చేసిన తాను, క్రమబద్ధమైన ప్రణాళికతో చదివి యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షలో దేశవ్యాప్తంగా 44వ ర్యాంక్ సాధించినట్లు వివరించారు. యువత తమపై తాము నమ్మకం ఉంచి, కష్టపడి చదివితే ఎలాంటి కఠినమైన లక్ష్యనైనా సులభంగా సాధించవచ్చని ఆమె ఈ సందర్భంగా సూచించారు. రసాయనాలపై ఆధారపడిన వ్యవసాయం వల్ల భూసారం దెబ్బతినడమే కాకుండా మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని 'సేవ్' ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు విజయ రామ్ అన్నారు. పాతకాలపు సహజ వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారానే భూమిని కాపాడుకుంటూ ఆరోగ్యకరమైన ఆహారాన్ని పొందవచ్చని సూచించారు. ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త సుభాష్ పాలేకర్ రూపొందించిన సహజ సిద్ధమైన విధానాలను పాటిస్తే.. రైతులు అతి తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని వివరించారు. ముఖ్యంగా కులాకర్ వంటి సంప్రదాయ బియ్యం రకాల్లో అధిక పోషక విలువలు ఉంటాయని, ఇవి శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. ప్రజలందరూ రసాయన రహిత ఆహారాన్ని తీసుకోవాలని, రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. కాగా, సహజ వ్యవసాయంపై ఆసక్తి ఉన్న రైతులకు, ప్రజలకు హైదరాబాద్‌లో ఏడాది పొడవునా ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ .. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు. మహిళల ఆరోగ్యం, భద్రత, విద్య , ఆర్థిక స్వావలంబన కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా కలిసి పనిచేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ప్రముఖ పోషకాహార నిపుణులు, మనస్తత్వవేత్త డాక్టర్ నిదా ఫాతిమా మాట్లాడుతూ, ఆరోగ్యం అంటే కేవలం మనం తీసుకునే పోషకాహారం మాత్రమే కాదని, మానసిక ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. మనం తీసుకునే ఆహారం కేవలం శారీరక శక్తికే కాకుండా, మన ఆలోచనలను మరియు ఒత్తిడిని నియంత్రించే మెదడు పనితీరును కూడా ప్రభావితం చేస్తుందని ఆమె వివరించారు. పోషక విలువలున్న ఆహారమే మానసిక ప్రశాంతతకు పునాది అని, ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడిని అధిగమించడానికి పోషణ, మనస్తత్వ శాస్త్రం రెండూ సమన్వయంతో ఉండాలని ఆమె పేర్కొన్నారు. చైల్డ్ అండ్ అడోలెసెంట్ సైకియాట్రిస్ట్ కన్స్టలెంట్ హరిణి మాట్లాడుతూ.. పిల్లలు కౌమారదశలో ఉన్నవారి మానసిక ఆరోగ్యం, వారి వికాసం కోసం తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. కార్యక్రమం ముగింపులో, విధి నిర్వహణలో విశేష ప్రతిభ కనబరుస్తున్న మహిళా అధికారులను, సిబ్బందిని మరియు పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. ముఖ్యంగా నగర పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న మియాపూర్, పటాన్‌చెరు, నిజాంపేట్, మరియు మాదాపూర్ ప్రాంతాల మహిళా పారిశుధ్య కార్మికులను వేదికపై ప్రత్యేకంగా సన్మానించి, వారికి జ్ఞాపికలను అందజేశారు. ఈ వేడుకలో భాగంగా పలువురు నిపుణులు, కళాకారులు పాల్గొని కార్యక్రమాన్ని మరింత ఆసక్తికరంగా మార్చారు. ఏఎస్ఐ కె. వనజ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా కార్యక్రమం అందరినీ అలరించింది. అలాగే, శ్రీలత, శ్రీకృష్ణల గీతాలాపన కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎక్స్ పో సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ ప్రదర్శనలో మహిళలకు సంబంధించిన రకరకాల దుస్తులు, చేనేత వస్త్రాలు, అలంకరణ వస్తువులు మరియు పోషక విలువలున్న ఆహార పదార్థాల స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి, శేరిలింగంపల్లి డీసీపీ సిహెచ్. శ్రీనివాస్, అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డీసీపీ వై.వి.ఎస్. సుధీంద్ర, డబ్ల్యూ అండ్ సీఎస్‌డబ్ల్యూ డీసీపీ సృజన కరణం, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, సైబర్ క్రైమ్స్ డీసీపీ సాయి మనోహర్, ట్రాఫిక్-ఎ డీసీపీ రంజన్ రతన్ కుమార్, ట్రాఫిక్-ఎఎ డీసీపీ ఎస్. శేషాద్రిని రెడ్డి, ఏడీసీపీలు, పోలీస్ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లు

**గృహప్రవేశాన్ని ప్రారంభించిన మహ్మద్ షబ్బీర్ అలీ**



**కామారెడ్డి,మార్చి7 :** కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పాల్గొని లబ్దిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భిక్కనూర్ లక్ష్మి, చిట్యాల రాజమణిలకు నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఎం ఆదేశాల మేరకు లబ్దిదారులకు నిత్యావసర సరుకులు , వస్త్రాలు అందజేశారు. అనంతరం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్కతో ఫోన్ ద్వారా మాట్లాడించి, లబ్దిదారులకు మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ , జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి పాదయాత్ర సమయంలో కూలిపోయిన ఇళ్లను చూసి చలించిపోయి అధికారంలోకి రాగానే ఇళ్లను నిర్మించి ఇస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశం చేయించడం ప్రభుత్వం ప్రజల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న మరికొన్ని ఇందిరమ్మ ఇళ్లను కూడా త్వరలో పూర్తి చేసుకోవాలని లబ్దిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధు మోహన్, గ్రామ సర్పంచ్ లక్ష్మి, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్, మున్సిపల్ ఛైర్మన్ ఇప్ప ఉమారాణి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సివిల్స్‌లో ఓబిసి అభ్యర్థులకు ర్యాంకులు

**అభినందించిన తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్**

**హైదరాబాద్,మార్చి7 :** ఇటీవల విడుదలైన సివిల్ పరిక్షా ఫలితాల్లో తెలంగాణకు చెందిన 20 మంది అభ్యర్థులకు మంచి మార్కులు రావటం, అందులో 10 మంది అభ్యర్థులు ఓబీసీ వర్గానికి చెందినవారు కావడం ఎంతో సంతోషదాయకమని తెలంగాణ బీసీ కమిషన్ అభివర్ణించింది. బీసీ కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి తెలంగాణ నుండి మంచి ర్యాంకులు సాధించిన 20 మంది అభ్యర్థులకు అభినందనలు తెలిపారు. తెలంగాణ నుండి మంచి ర్యాంకులు వచ్చిన 20 మందిలో 10 మంది బీసీ వర్గాలకు చెందిన వారు కావడం బీసీల్లో విద్యాపరంగా కలుగుతున్న చైతన్యానికి నిదర్శనం అని పేర్కొన్నారు.

# హైదరాబాద్ కేంద్రంగా

**ప్రపంచస్థాయి ఏఐ ఆర్థిక ఆవిష్కరణలు**

**మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి**



**హైదరాబాద్,మార్చి7 :** కృత్రిమ మేధ ఆధారిత ఆర్థిక సాంకేతిక రంగంలో హైదరాబాద్ గ్లోబల్ హబ్‌గా ఎదుగుతోందని ఐటి, పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. శనివారం నాడు బాచుపల్లిలోని విజ్ఞానజ్యోతి ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ లో ఫిక్కి నిర్వహించిన సిఎఫ్ ఓ ల సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేసారు. ప్రపంచంలోని ప్రముఖ ఆర్థిక సంస్థలు నగరంలో తమ ఆవిష్కరణలు, ఇంజినీరింగ్ కేంద్రాలను స్థాపిస్తున్నాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

కృత్రిమ మేధ టెక్నాలజీ పాత్రను పూర్తిగా మార్చేస్తోంది. ఇప్పటివరకు కంపెనీ ఖర్చులను లెక్కించడానికి ఉపయోగపడిన టెక్నాలజీ, ప్రస్తుతం ఆవిష్కరణలు, మెరుగైన ఆర్థిక నిర్ణయాలకు సహాయపడుతోంది. హైదరాబాద్ ప్రపంచంలోనే అత్యంత బలమైన ఫైనాన్షియల్ టెక్నాలజీ ఎకోసిస్టమ్‌లలో ఒకటిగా అభివృద్ధి చెందింది. వ్యాన్ గార్డ్, యుబిఎస్ , వెల్స్ ఫార్గో, బ్యాంక్ ఆఫ్ అమెరికా, మాస్ మ్యూచువల్, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, జెపి మోర్గాన్ చేస్ , గోల్డ్ మ్యాన్ శాక్స్, సిటి గ్రూప్ లాంటి ప్రఖ్యాత ఆర్థిక సంస్థలు నగరంలో భారీ టెక్నాలజీ, అనలిటిక్స్ కేంద్రాలను నిర్వహిస్తున్నాయి. నగరంలో ప్రస్తుతం 400 గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు మూడు లక్షల మందికి పైగా వృత్తి నిపుణులకు ఉపాధి కల్పిస్తున్నాయి. తెలంగాణ ఐటీ రంగం ఎగుమతులు సంవత్సరానికి దాదాపుగా 40 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. తదుపరి దశ విస్తరణ కోసం ఏఐ సిటీ, ఫ్యూచర్ సిటీ, ఏఐకేఏఎం లను ఏర్పాటు చేస్తున్నాం. వీటి ద్వారా ఏఐ ఎకోసిస్టమ్‌ను మరింత బలోపేతం చేయడం, డిజిటల్ మౌలిక వసతులను మెరుగుపర్చడం, ఏఐ ఆధారిత ఆర్థిక వ్యవస్థకు అవసరమైన నిపుణులను తయారు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాం అని మంత్రి అన్నారు. డిజిటల్ యుగంలో సీఎఫ్ఓల పాత్ర మరింత కీలకంగా మారింది కృత్రిమ మేధ, డేటా ఆధారిత రంగాల్లో పెట్టుబడులకు మార్గనిర్దేశర చేయడంలో వారి సేవలు మరింత ప్రాధాన్యతను సంతరించుకున్నాయని శ్రీధర్ బాబు వివరించారు. సదస్సులో మాజీ చీఫ్ విజిలెన్స్ కమిషనర్ కె.వి.చౌదరి, ప్రముఖ నిర్మాత, విజ్ఞానజ్యోతి ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్ అధ్యక్షుడు దగ్గుబాటి సురేశ్ బాబు, ఫిక్కి సిఎఫ్ ఓ కౌన్సిల్ ఛైర్మన్ రజనీష్ జైన్, కో ఛైర్మన్ సుబ్బయ్య కుమార్, విజ్ఞాన జ్యోతి సంస్థల సిఇఓ, మాజీ డిజిపి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com